# సూర్య ఉదయం

ప్రతి పదం... ప్రజా శ్రేయస్కరం

తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను

సూర్య ఉదయం తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర పదేశ్ ,తెలంగాణలో అన్ని నియోజకవర్గ, కేంద్రాలలో అసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడునుపూర్తి వివరాలకు సంప్రదించండి.

ఐడి కార్డు ఉచితం

యం.సునిల్ కుమార్

సూర్య ఉదయం తెలుగు దిన పత్రిక ఎడిటర్

సెల్ : 08512 254632



ఎడిటర్ : యం. సునీల్ కుమార్ సంపుటి : 08 సంచిక : 255 మంగళవారం 08 - 09 - 2026 పేజిలు : 08 వెల రూ. 2 రూ/

Published From Kurnool : Circulated at VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam,Chittoor, Kurnool, Kadapa, Anantapuram, Hyderabad


## స్థానిక సమరానికి టీడీపీ సై




- 28 జిల్లాలకు ఇన్‌ఛార్జ్‌లను ప్రకటించిన అధిష్ఠానం
- అభ్యర్థుల ఎంపిక బాధ్యత ఎమ్మెల్యేలకు బదులు సీనియర్లకు అప్పగింత
- మిత్రపక్షాలతో సమన్వయం, ప్రచారంపై ఇన్‌ఛార్జ్‌లకు కీలక బాధ్యతలు
- ఫలితాల్లో తేడా వస్తే ఒప్పుకోనని కుప్పం నేతలకు చంద్రబాబు హెచ్చరిక

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సర్వసన్నద్ధమవుతోంది. ఈ దిశగా ఎన్నికల కసరత్తును వేగవంతం చేస్తూ, రాష్ట్రంలోని 28 జిల్లాలకు పార్టీ ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఈసారి సరికొత్త వ్యూహాన్ని అనుసరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. - మిగతా 2 లో

## ప్రతి ఎకరాకు సాగునీరే లక్ష్యం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించి జలహారతి పడతామన్న సీఎం
- 'వాటర్ మ్యాన్'గా ఎకనామిక్ టైమ్స్ కథనంపై హర్షం
- సీఎంకు నేతల స్టాండింగ్ ఒవేషన్
- గత పాలనపై విమర్శలు.. ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి
- కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు సముచిత గౌరవమని హామీ
- టీడీపీ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్.. పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం




**అమరావతి :** రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి ఎకరాకు నీరు అందించి తెలుగుతల్లికి జలహారతి పట్టడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సాగునీటి రంగంపై తాను చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రతిష్ఠాత్మక 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించడం సంతోషంగా ఉందని అన్నారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల 'లీడర్‌షిప్ కాన్‌క్లేవ్'లో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సాగునీటి రంగంపై చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందన తీర్మానం ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీతో యువతకు ఉపాధి కల్పించిన చంద్రబాబు, ఇప్పుడు జల సంరక్షణతో 'వాటర్ మ్యాన్'గా మారారని కొనియాడారు. పట్టిసీమ, హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల - మిగతా 2 లో


2 లో

## మా పార్టీ సీఎం అభ్యర్థి నేను కాదు

- విజయసాయిరెడ్డి
- అమరావతిపై నాకు అభ్యంతరం లేదు
- ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాజధానిగా అంగీకరించాల్సిందేనన్న విజయసాయి
- రెడ్డి, కమ్మ సామాజికవర్గాల వారే సీఎంలుగా ఉండాలా అని ప్రశ్న
- తమ పార్టీలో 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తానని వెల్లడి




### తెలంగాణలో 'ఎస్ఐఆర్'
## గడువు పొడిగింపు

- అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ
- సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని అంగీకరించిన ఎన్నికల సంఘం
- నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

**హైదరాబాద్ :** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ - మిగతా 2 లో


## గ్రామీణ యువతకు స్వర్ణ భారత్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్
- నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు ఘనస్వాగతం
- స్వర్ణ భారత్ ట్రస్ట్ రజతోత్సవాలకు హాజరైన యూపీ సీఎం యోగి
- నెల్లూరులో ఘన స్వాగతం పలికిన మంత్రులు నారాయణ, సత్యకుమార్
- అక్షర విద్యాలయంలో నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని పరిశీలన
- శిక్షణ పొందుతున్న యువతతో ముఖాముఖి నిర్వహించిన ఆదిత్యానాథ్
- ట్రస్ట్ సేవలను, విద్యాసంస్థల నిర్వహణను ప్రశంసించిన యూపీ సీఎం



**నెల్లూరు** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ సోమవారం నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేశారు. వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవ (రజతోత్సవ) వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, వై. సత్యకుమార్ సాదరంగా స్వాగతం పలికారు. అక్షర విద్యాలయం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగిన యోగికి మంత్రులతో పాటు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుమార్తె, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, కుమారుడు హర్షవర్ధన్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం యోగి అక్షర విద్యాలయం ప్రాంగణంలో ఉన్న సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని - మిగతా 2 లో

### మంగళగిరిలో కనిపించిన
## అరుదైన 'పునుగుపిల్లి'


2 లో

- మంగళగిరి పానకాల స్వామి కొండపై పునుగుపిల్లి ప్రత్యక్షం
- తిరుమల శ్రీవారికి శుక్రవారం అభిషేకంలో దీని తైలం వినియోగం
- శరీర గ్రంథుల నుంచి వచ్చే ద్రవంతో పవిత్ర తైలం తయారీ
- అంతరించిపోతున్న జాతిగా వన్యప్రాణి చట్టం కింద సంరక్షణ
- టీటీడీ ఆధ్వర్యంలో జూపార్క్‌లో ప్రత్యేకంగా వీటి పెంపకం

## అణు సామర్థ్యంతో ఉత్తర కొరియా 'కాంగ్ కోన్' నౌక


- రంగంలోకి దించిన ఉత్తర కొరియా!
- 'కాంగ్ కోన్' డిస్ట్రాయర్‌ను ప్రారంభించిన ఉత్తర కొరియా
- ఇది తమ అణు ప్రతిచర్య వ్యవస్థలో భాగమని ప్రకటించిన కిమ్
- నావికాదళాన్ని అణుశక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టీకరణ
- కుటుంబంతో కలిసి నౌకా ప్రారంభోత్సవంలో పాల్గొన్న కిమ్




**ఢిల్లీ :** ఉత్తర కొరియా తన నావికాదళాన్ని ఆధునీకరించే ప్రణాళికల్లో భాగంగా మరో కీలక ముందడుగు వేసింది. అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యంతో నిర్మించిన 'కాంగ్ కోన్' అనే కొత్త డిస్ట్రాయర్ (విధ్వంసక నౌక)ను - మిగతా 2 లో

### హర్మ్యూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్తత
## భగ్గుమన్న చమురు ధరలు

- యూఎస్-ఇరాన్ నౌకలపై దాడులతో పెరిగిన ఆయిల్ ధరలు
- హర్మ్యూజ్ జలసంధిలో భారీగా తగ్గిన నౌకల రాకపోకలు
- 97 డాలర్లకు చేరువలో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర
- చమురు సరఫరా అంతరాయాలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన



**ఢిల్లీ :** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. అమెరికా, ఇరాన్ - మిగతా 2 లో



## ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవద్దు

- పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు
- అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని పోలీసులకు ఆదేశం
- నిబంధనల ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారని స్పష్టీకరణ
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై విచారణ జరపాలని ఉత్తర్వులు
- బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని డీజీపీకి సూచన

**హైదరాబాద్ :** తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర - మిగతా 2 లో

## ఇది దుశ్శాసన సభ...


2 లో

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?
- శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్
- తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి
- ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ





# విద్యాభివృద్ధికి ప్రతీకగా 'రేయిన్‌బో' పదేళ్ల ప్రస్థానం

**వైభవంగా 10వ వార్షికోత్సవ వేడుకలు**

**సీనియర్ ఉపాధ్యాయులు, సిబ్బందికి ఘన సన్మానం**

**సూర్య ఉదయం ప్రతినిధి (ఆదోని) :** స్థానిక రేయిన్‌బో ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల 10వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం పాఠశాల కరస్పాండెంట్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గోవిందరెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు స్వల్ప ఫీజులతో నాణ్యమైన, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో 2017లో కేవలం 130 మంది విద్యార్థులతో పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజల ఆదరణ, నమ్మకంతో పదేళ్లలో దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 1,220కి చేరిందని హర్షం వ్యక్తం చేశారు. విద్యాబోధనతో పాటు విద్యార్థులలో నైతిక విలువలు, సామాజిక బాధ్యత అలవర్చేలా కృషి చేస్తున్నామని, పాఠశాల వికాసంలో తల్లిదండ్రుల సహకారం, సిబ్బంది కృషి అభినందనీయమని పేర్కొన్నారు.


సీనియర్ ఉపాధ్యాయురాలు నాగరత్నమ్మను సన్మానిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ గోవిందరెడ్డి

**తొలిసారిగా 10వ తరగతి బ్యాచ్.. 100% ఉత్తీర్ణతే లక్ష్యం**

ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాల నుంచి తొలిసారిగా 10వ తరగతి బ్యాచ్ అందుబాటులోకి వచ్చిందని గోవిందరెడ్డి వెల్లడించారు. విద్యార్థులు పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు మరింత మెరుగైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**సీనియర్ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**

దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పాఠశాల అభివృద్ధికి దీర్ఘకాలంగా సేవలందిస్తున్న హెచ్ఎం ప్రసాద్, సీనియర్ ఉపాధ్యాయులు నాగరత్నమ్మ, ఆర్. శృతి, రంగమ్మ, గీత, రామకృష్ణ, అశోక్, రూతమ్మ, అంజీలతో పాటు బోధనేతర సిబ్బంది పూజారి విజయ్, దుర్గమ్మ, హనుమన్న, హనుమేష్, రఘు, వీరేష్, అంజినమ్మలను కరస్పాండెంట్ శాలువాలు, షీల్డులు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు జె. పుల్లయ్య, నూర్ బాషా, గోపాల్ మూర్తి, గోపాలకృష్ణ, రమేష్, గోపాల్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సహారా డెంటల్ వైద్యులకు వేజండ్ల కిషోర్ బాబు శుభాకాంక్షలు

**- కూకట్‌పల్లిలో సహారా డెంటల్ ప్రారంభోత్సవం**



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ కాలనీ జేఎన్‌టీయూ రోడ్డులో, ఐసీఐసీఐ బ్యాంకు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సహారా డెంటల్ (ౠూనూ=ూ ణజుచీ–ూూ) ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నందమూరి రామకృష్ణ ను టీడీపీ తెలంగాణ మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పెద్దపల్లి పార్లమెంట్ పరిశీలకులు వేజండ్ల కిషోర్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే మరో అతిథిగా హాజరైన గోనుగుంట్ల లీలావతి, ఎమ్మెల్యే జి.వి. ఆంజనేయులు సతీమణిని కూడా ఆయన కలిశారు.

**అత్యాధునిక దంత వైద్యం అందిస్తాం :** సహారా డెంటల్ వైద్యులు డాక్టర్ అట్లూరి మనోజ్, వీణా, డాక్టర్ అభినయ బొల్లేపల్లి, వీణాలను కలిసి వేజండ్ల కిషోర్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. సహారా డెంటల్‌లో అత్యాధునిక దంత వైద్య విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు మెరుగైన దంత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కిషోర్ బాబుతో పాటు ఆయన ఆత్మీయ మిత్రులు వీఎస్ ప్రసాద్, వెంకయ్య, బొల్లేపల్లి వెంకట్రావు పాల్గొన్నారు. నూతనంగా ప్రారంభమైన సహారా డెంటల్ విజయవంతంగా కొనసాగాలని, ప్రజలకు నాణ్యమైన దంత వైద్య సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు..

# 420 హామీలు.. 6 గ్యారంటీలు ఏవి?

**- కేపిహెచ్బీలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ భారీ నిరసన**

**- 420 అడుగుల బాకీ కార్డుతో ర్యాలీ.. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం**





**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కేపిహెచ్బీ డివిజన్‌లో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచనల మేరకు కేపిహెచ్బీ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు, బాలాజీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పగడాల శిరీష బాబురావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కేపిహెచ్బీ డివిజన్‌లోని వసంత్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ప్రజల ఆస్తులను 22-ఏ లో చేర్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆరోపించారు. అలాగే ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములను కోట్లాది రూపాయలకు విక్రయించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు దాటినా ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా 420 అడుగుల బాకీ కార్డును ప్రదర్శిస్తూ కేపిహెచ్బీ టెంపుల్ బస్‌స్టాప్ నుంచి కేపిహెచ్బీ మూడో ఫేజ్‌లోని జయశంకర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు, శిరీష బాబురావు లు మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో అమలులో ఉన్న సంక్షేమ పథకాలను సైతం రద్దు చేసి అన్ని రంగాల్లో సంక్షోభాన్ని సృష్టించిందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాల కారణంగా ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు కృష్ణారెడ్డి, ప్రభాకర్ గౌడ్, వెంకటేష్, రాజేష్ రాయ్, సీనియర్ నాయకులు శ్యామల రాజు, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, కే. పవన్ కుమార్, హరినాథ్, సురేష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శివారెడ్డి, కంచరపల్లి నాగరాజు, సుభాష్ గౌడ్, రమణ, రాంబాబు నాయుడు, కచిన్ టైలర్, వలవల నాయుడు, శ్రీనివాస రెడ్డి, తులసి రెడ్డి, పాతూరి గోపి, సాయి శ్రీనివాస్, రావెల్ షా, మోజేష్, దినేష్, రవిసింగ్‌తో పాటు మహిళా నాయకులు అనిత శ్రీపాద, అరుణ శెట్టి, లక్ష్మీరాజ్యం, ధనలక్ష్మి, హేమ, సుబ్బలక్ష్మి, లక్ష్మి, ఉష, లలిత, స్వప్న, సావిత్రి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేపీహెచ్‌బీలో బీఆర్ఎస్ ఆందోళన





**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచనల మేరకు కేపీహెచ్‌బీ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, బాలాజీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పగడాల శిరీష బాబురావు ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. హామీలు నెరవేర్చడం లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ 420 అడుగుల బాకీ కార్డుతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్ నుంచి మూడో ఫేజ్‌లోని జయశంకర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేపీహెచ్‌బీ డివిజన్‌లోని వసంత్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజల ఆస్తులను 22-ఏ జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అలాగే ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములను వేల కోట్ల రూపాయలకు విక్రయించడాన్ని వారు తీవ్రంగా తప్పుబట్టారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీల అమలుపై నిరసన వ్యక్తం చేయడం జరిగిందని అన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో అమలులో ఉన్న సంక్షేమ పథకాలను సైతం రద్దు చేసి అన్ని రంగాల్లో సంక్షోభ పరిస్థితులు సృష్టించిందని ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులతో ప్రజలు తీవ్రంగా సతమతమవుతున్నారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ప్రజల తరఫున నిరంతరం పోరాడుతామని, ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు కృష్ణారెడ్డి, ప్రభాకర్ గౌడ్, వెంకటేష్, రాజేష్ రాయ్, సీనియర్ నాయకులు శ్యామల రాజు, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, కే. పవన్ కుమార్, హరినాథ్, సురేష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శివారెడ్డి, కంచరపల్లి నాగరాజు, సుభాష్ గౌడ్, రమణ, రాంబాబు నాయుడు, గఫూర్, కచిన్ టైలర్, పాతూరి గోపి, సాయి శ్రీనివాస్, రావెల్ షా, మోజేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకులు అనిత శ్రీపాద, అరుణ శెట్టి, లక్ష్మీరాజ్యం, ధనలక్ష్మి, హేమ, సుబ్బలక్ష్మి, లక్ష్మి, ఉష, లలిత స్వప్న, సావిత్రి, ప్రేమలత తదితరులు పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు.

# పేదింటి బిడ్డ సంజనకు డాక్టర్ సీటు

**- ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన సంజనకు ఘన సన్మానం**

**- గ్రామీణ యువతకు సంజన ఆదర్శం: సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్**



**సూర్య ఉదయం ప్రతినిధి, హైదరాబాద్:** పేద, అణగారిన వర్గాల కుటుంబం నుంచి వచ్చి కష్టపడి చదివి ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన ఎన్కతల గ్రామానికి చెందిన సంజనను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్ సంజనను అభినందించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం సంజనను శాలువాతో సత్కరించి, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని బహూకరించారు.

**ఎన్కతల గ్రామానికే గర్వకారణం: సర్పంచ్**

సంజన ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం ఆమె కుటుంబానికే కాకుండా మొత్తం ఎన్కతల గ్రామానికి గర్వకారణమని సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఆర్థిక ఇబ్బందులు, సామాజిక సవాళ్లు ఎదురైనా పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సంజన తన విజయంతో నిరూపించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, ముఖ్యంగా యువతులు సంజనను ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు. చదువే జీవితాన్ని మార్చే గొప్ప ఆయుధమని, తల్లిదండ్రులు తమ పిల్లల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సంజన విజయం గ్రామంలోని మరెంతో మంది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని, ఆమె స్ఫూర్తితో మరిన్ని కుటుంబాల నుంచి విద్యార్థులు ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు.

**అంబేద్కర్ ఆశయాలకు ప్రతిబింబం: కట్టెల మల్లేశం**

అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం మాట్లాడుతూ.. మహిళలకు విద్య అందని రోజుల్లోనే వారికి విద్య, సమానత్వం, హక్కులు కల్పించేందుకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహోన్నత పోరాటం చేశారని గుర్తుచేశారు. మహిళలు చదువుకుంటేనే కుటుంబం, సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందని అంబేద్కర్ బలంగా విశ్వసించారని తెలిపారు. మహిళలకు విద్యా హక్కు, సమాన హక్కులు, గౌరవంగా జీవించే అవకాశాల కోసం అంబేద్కర్ చేసిన కృషి ఫలితంగానే నేడు సంజన వంటి ఎంతోమంది మహిళలు ఉన్నత విద్యను అభ్యసించి వైద్యులు, ఇంజనీర్లు, అధికారులు వంటి ఉన్నత స్థానాలకు ఎదుగుతున్నారని అన్నారు.

**అణగారిన వర్గాల యువతకు స్ఫూర్తి**

అవకాశం లభిస్తే అణగారిన వర్గాల పిల్లలు కూడా ఆకాశమే హద్దుగా ఎదగగలరని సంజన నిరూపించిందని మల్లేశం అన్నారు. ఒక గ్రామీణ యువతి ఎంబీబీఎస్ సీటు సాధించి వైద్యురాలిగా ఎదగబోతుండటం అంబేద్కర్ ఆశయాలకు ప్రతిబింబమన్నారు. సంజన విజయం కేవలం ఒక విద్యార్థి విజయం మాత్రమే కాదని, గ్రామీణ, అణగారిన వర్గాల యువతలో కొత్త ఆశలు, ఆత్మవిశ్వాసాన్ని నింపే విజయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో సంజన మంచి వైద్యురాలిగా ఎదిగి పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్‌తో పాటు గ్రామ పెద్దలు, యువత, ప్రజలు సంజనను ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ ప్రముఖ నాయకులు లంబడి సురేష్, శనేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ పట్లోళ్ల మహిపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నారాయణరెడ్డి, గ్రామపంచాయతీ సభ్యులు మేతరి శ్రీనివాస్, అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు డప్పు పోచయ్య, తలారి ఆనంద్, గ్రామపంచాయతీ సిబ్బంది, వివిధ యువజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి



**సూర్య ఉదయం ఆదోని:** కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని, ఆదోని మండలం రెండు కరువు మండలం గా ప్రకటించాలని కోరుతూ సెప్టెంబర్ 10వ తేదీన ఆదోని తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి లింగన్న, పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు జే రామాంజనేయులు తెలిపారు. పాండవుగల్లు గ్రామంలో బాలయ్య గారి మూర్తి కొండగొని నాగరాజు పొలాలను వారు పరిశీలించి మాట్లాడారు. ఈ సంవత్సరం ఎల్నినో ప్రభావంతో వర్షాలు లేక పంటలన్నీ దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం కలిగిందని, కౌలు రైతు నాగరాజు నాలుగు ఎకరాలలో లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టారని కౌలు కూడా తిరిగిరాని పరిస్థితి ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం ఆదోని మండలం -2 ను కరువు మండలం గా ప్రకటించి రైతులకు ఎకరాకు 50వేల రూపాయలు పంట నష్టపరిహారం ఇవ్వాలని అర్హులైన పేదలకు 14 రకాలు నిత్యవసర వస్తువులు అందజేయాలని, తక్షణమే ఉపాధి పనులు 200 రోజులకు పెంచి అందరికీ పని కల్పించి 700 రూపాయలు వేతనం ఇవ్వాలని, అర్హులైన పేదలకు కరువు పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు పాండురంగ శాఖ కార్యదర్శులు గోవిందు, అనీఫ్ భాష, మాజీ ఉపసర్పంచ్ తిక్కయ్య, పార్టీ సభ్యులు నర్సిరెడ్డి, భీమాంజి, హనుమంత రెడ్డి, రైతులు చిన్న హనుమంతు, నాగరాజు, బి మూర్తి, వులిగరాజు, పూజారి గోపాల్ రెడ్డి, హనుమంత రెడ్డి,పి . అంజనేయ దేవయ్య, చిన్న బసయ్య, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టు ప్రజాస్వామ్యానికి విరుద్ధం

**అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవడం అన్యాయం: రెడ్డి సతీష్ అరోరా**

**అరెస్టు చేసిన ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేయాలి**



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకుని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీల అమలు, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే వారిని సభలోకి రానీయకుండా అరెస్టులు చేస్తోందని రెడ్డి సతీష్ అరోరా ఆరోపించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రశ్నలు అడిగితే ప్రభుత్వం సమాధానం చెప్పాలి తప్ప, వారిని అడ్డుకోవడం, అరెస్టు చేయడం సమస్యకు పరిష్కారం కాదన్నారు.

**బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల తీరుపై ఆగ్రహం**

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష పోలీసులు అనుచితంగా వ్యవహరించడం, చీర లాగడం, మెడ పట్టుకోవడం వంటి ఘటనలు అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. మహిళలకు గౌరవం ఇస్తామని చెప్పే ప్రభుత్వం ఇలాంటి ఘటనలకు ఎలా అవకాశం కల్పిస్తుందని ప్రశ్నించారు.

**ప్రజాప్రతినిధుల హక్కులను కాపాడాలి**

ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులకు అసెంబ్లీలో తమ నియోజకవర్గ ప్రజల సమస్యలను ప్రస్తావించే హక్కు ఉందని సతీష్ అరోరా అన్నారు. ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి రానీయకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు, నిరసన తెలిపే హక్కు, ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే హక్కు ప్రతి ప్రజాప్రతినిధికి ఉండాలని, ఆ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.

**వెంటనే విడుదల చేయాలి**

అరెస్టు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేసి, ఎలాంటి ఆటంకాలు లేకుండా వారు అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రెడ్డి సతీష్ అరోరా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను చైతన్యపరిచి అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు.

# ఉరుకుంద ఈరన్న స్వామి ఉత్సవాల్లో కర్ణాటక వీరుల విన్యాసాలు

**204 కేజీల రాతి గుండును ఎత్తి సత్తా చాటిన 'కర్ణ'!**





**(సెప్టెంబర్ 7సూర్య ఉదయం ప్రతినిధి మంత్రాలయం) :** .. ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకి ఉత్సవాల సందర్భంగా కందుకూరులో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ క్రీడల్లో కర్ణాటకకు చెందిన వ్యక్తులు తమ సత్తా చాటారు. జిల్లా, కప్పగల్ తాలూకాకు చెందిన 'కర్ణ' అనే వ్యక్తి 204 కేజీల రాతి గుండును అత్యంత అవలీలగా ఎత్తి ప్రేక్షకుల చేత "వావ్" అనిపించుకున్నాడు. షాపూర్ జిల్లా, శారదల్లి గ్రామానికి చెందిన మరియప్ప నాయక్ 200 కేజీల ఇసుక బస్తాను సునాయాసంగా పైకెత్తి తన దారుఢ్యాన్ని చాటుకున్నాడు. ఈ గ్రామీణ క్రీడలలో క్రీడాకారులు చూపిన సాహసాలు, ప్రదర్శనలు పల్లకి ఉత్సవాలకు వచ్చిన భక్తులను, స్థానికులను విశేషంగా అలరించాయి.

# జీవో 97ను రద్దు చేయాల్సిందే

**- హై లెవల్ కమిటీ నుంచి కేకే, నవీన్ మిట్టల్‌ను తొలగించాలి**

**- అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు నిర్ణయం తీసుకోవాలి: ఎరవెల్లి జగన్**



**సూర్య ఉదయం ప్రతినిధి, హైదరాబాద్:** పాలిటెక్నిక్ విద్యార్థులు, ఉద్యోగులకు సంబంధించిన జీవో 97ను అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు రద్దు చేయాలని తెలంగాణ పాలిటెక్నిక్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్ డిమాండ్ చేశారు. హైదరాబాద్, సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 30 పాలిటెక్నిక్ కాలేజీల ప్రతినిధులు, పూర్వ విద్యార్థులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో 97పై ప్రభుత్వం ఏర్పాటు చేసిన హై లెవల్ కమిటీ విద్యార్థుల ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. పాలిటెక్నిక్ విద్యను నాశనం చేశారని ఆరోపిస్తూ నవీన్ మిట్టల్‌ను కమిటీ నుంచి తొలగించాలని, జీవో 97పై అసెంబ్లీలో చర్చించాలని కోరారు. ప్రభుత్వం కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు జనార్దన్, అక్షయ్, విశాల్ తో పాటు 70 మందికి పైగా పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

# భార్య హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**- రూ.20 వేల జరిమానా విధించిన రాజేంద్రనగర్ కోర్టు**



**సూర్య ఉదయం ప్రతినిధి, సైబరాబాద్:** భార్యను గొంతు నులిమి హత్య చేసిన కేసులో నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. ఈ వివరాలను సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ ఎ. ముత్యం రెడ్డి వెల్లడించారు. నిందితుడు పొన్న నాగేశ్వరరావు ఏ నాగేష్ (47), మంచిరేవుల గ్రామం, గండిపేట మండలం, రంగారెడ్డి జిల్లా వాసిగా పోలీసులు గుర్తించారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో 2017లో నమోదైన క్రైం నంబర్ 685/2017, సెక్షన్ 302 ఐపీసీ కింద నమోదైన హత్య కేసులో విచారణ అనంతరం నిందితుడిని కోర్టు దోషిగా నిర్ధారించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు పొన్న నాగేశ్వరరావు 2004లో పి. కల్పనను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ, ఆర్థిక సమస్యల కారణంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. భర్త వేధిస్తున్నాడంటూ మృతురాలు గతంలో ఫిర్యాదులు కూడా చేసినట్లు పోలీసులు తెలిపారు. 2017 దసరా సమయంలో కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన వివాదాలతో భార్యాభర్తల మధ్య విభేదాలు మరింత తీవ్రతరమయ్యాయి. 05 అక్టోబర్ 2017న సిగరెట్ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ సందర్భంగా నిందితుడు భార్యపై దాడి చేసి విధులకు వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి వచ్చిన అనంతరం మరోసారి భార్యతో గొడవకు దిగిన నిందితుడు.. ఆమె గొంతును చేతులతో బలంగా నులిమాడు. దీంతో కల్పన అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.

**పక్కా ఆధారాలతో దర్యాప్తు**

కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేయడంతో పాటు వైద్య ఆధారాలను సేకరించారు. మృతురాలి మరణం హత్యాత్మక మరణమని వైద్య ఆధారాల ద్వారా నిర్ధారణ అయింది. దర్యాప్తులో నిందితుడే ఉద్దేశపూర్వకంగా ఆమె మరణానికి కారణమైనట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. నిందితుడిని 07.10.2017న అరెస్టు చేసిన పోలీసులు.. దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసుపై పూర్తిస్థాయి విచారణ అనంతరం రాజేంద్రనగర్‌లోని రంగారెడ్డి జిల్లా 10వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించింది. జీవిత ఖైదుతో పాటు రూ.20,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో దర్యాప్తు అధికారి, నార్సింగి డివిజన్ ఏసీపీ జి.వి. రమణ గౌడ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. కృష్ణమూర్తి సమర్థవంతంగా పని చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేశారని డీసీపీ క్రైమ్స్ ఎ. ముత్యం రెడ్డి తెలిపారు.

# కోటి ఇళ్లను దాటి మరింత ముందుకు 43వ రోజు విజయవంతంగా 'ఇంటింటికీ తెలుగుదేశం--2026'


**43వ రోజుకు చేరిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం**

**ఇప్పటివరకు 1.06 కోట్ల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు**

**సోమవారం ఒక్కరోజే 1.30 లక్షల కుటుంబాలతో నేతల భేటీ**

**కూటమి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ**

**కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్న టీడీపీ**




కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం -- 2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. సోమవారంతో ఈ కార్యక్రమం 43వ రోజుకు చేరుకుంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.06 కోట్ల ఇళ్లను సందర్శించి ఈ కార్యక్రమం ఒక కీలక మైలురాయిని దాటింది.ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం, వారి అభిప్రాయాలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఒక్కరోజే టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి 1,30,402 ఇళ్లను సందర్శించారు. ప్రతి గడపకూ వెళ్లి కుటుంబ సభ్యులతో ముఖాముఖిగా సంభాషిస్తూ ప్రభుత్వ పనితీరును వివరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా టీడీపీ శ్రేణులు.. రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు అందుతున్న పథకాల ప్రయోజనాలను తెలియజేస్తున్నారు. అదే సమయంలో, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేసేలా వారి నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని, పార్టీ శ్రేణులతో పాటు సాధారణ ప్రజలు కూడా ఉత్సాహంగా ఇందులో భాగస్వాములవుతున్నారని టీడీపీ వర్గాలు తెలిపాయి. ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతోంది.

# ఎండిపోతున్న పంటలు- రైతులకు పురుగుల మందే దిక్కా

**రైతులను ప్రభుత్వ ఆదుకోవాలి.. లేనిపక్షంలో రైతుల సమక్షంలో ఉద్యమాలు చేపడతాం...**



**సూర్య ఉదయం ప్రతినిధి పెద్దకడబూరు :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారిందని, సకాలంలో సాగునీరందక పంటలు కళ్లముందే ఎండిపోతుంటే పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పెద్దకడబూరు మండలం చిన్నకడబూరు కంబాలదిన్నె మేకడోనా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ వాల్మీకి లక్ష్మన్న, బోయ వాల్మీకి ఖాసిం మైనారిటీ జావీద్, ధ్వజమెత్తారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి పాలకుల రైతు వ్యతిరేక విధానాలపై ఆయన నిప్పులు చెరిగారు.

**ఈ సందర్భంగా లక్ష్మన్న మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు:**

నాడు నీటి కళ.. నేడు ఎడారి స్థితి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంత్రాలయం శాసనసభ్యులు వై. బాలనాగిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకూ సాగునీరు సక్రమంగా అందించిన ఘనత దక్కించుకున్నారు. నాడు రైతులు రెండు పంటలు పండించుకుని సంతోషంగా జీవించారు.మాటల్లేవు.. చేతల్లేవు: కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన ఈ సమయంలో సాగునీటి వ్యవస్థ పూర్తిగా కుదేలైంది. పంటలు నిలువునా ఎండిపోతున్నా కూటమి నాయకులు ఇప్పటివరకు సాగునీటిపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం.

**పురుగుల మందే శరణ్యమా:** పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలన్నీ ఎండిపోతుంటే అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు ఇక పురుగుల మందే దిక్కయ్యేలా కూటమి ప్రభుత్వం నెట్టివేసింది.

**తక్షణ డిమాండ్లు:** ఎండిపోయిన పంట పొలాలను అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించాలి.

నష్టపోయిన రైతులందరికీ ఖరీఫ్ ఇన్సూరెన్స్ పరిహారంతో పాటు ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలి.రైతుల సమస్యలను గాలికొదిలేస్తే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలు ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# లైసెన్సులు లేకుండా వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు- సైబరాబాద్ సీపీ

**- హోటల్స్, పబ్స్, బార్ల యజమానులతో సీపీ సమీక్ష సమావేశం**





**సూర్య ఉదయం ప్రతినిధి, సైబరాబాద్:** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోటల్స్, బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్స్, హుక్కా సెంటర్ల యజమానులతో సైబరాబాద్ సీపీ కార్యాలయ ఆడిటోరియంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, వ్యాపార సంస్థల యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వ్యాపార సంస్థలు ప్రభుత్వ నిబంధనలు, చట్టాలను తప్పనిసరిగా పాటిస్తూ కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి సంస్థకు అవసరమైన అన్ని లైసెన్సులు, అనుమతులు ఉండాలని స్పష్టం చేశారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ ఎన్‌ఓసీ, సీఏంసీ ఎన్‌ఓసీ, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఎన్‌ఓసీ, టౌన్ ప్లానింగ్ ఎన్‌ఓసీ తదితర అనుమతులను పొందాలని సూచించారు. ఖ్రామీ పోర్టల్ ద్వారా పొందిన లైసెన్సుల గడువు ముగిసిన వెంటనే రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో లైసెన్సులు పొందిన సంస్థల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, పెద్ద సంఖ్యలో హోటల్స్, రెస్టారెంట్లు, పబ్స్ నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సీపీ పేర్కొన్నారు. సరైన లైసెన్సులు, అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలను గుర్తించామని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**నిర్ణీత సమయాలు తప్పనిసరిగా పాటించాలి**

పబ్స్, బార్లు తదితర సంస్థలు అనుమతించిన సమయం ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ కార్యకలాపాలు కొనసాగించకూడదని సీపీ స్పష్టం చేశారు. సమయం దాటిన తర్వాత మద్యం విక్రయాలు లేదా ఇతర కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బార్ అండ్ రెస్టారెంట్లలోకి మైనర్లను అనుమతించరాదని స్పష్టం చేశారు. వ్యాపార సంస్థల్లో పనిచేసే సిబ్బందికి ఆధార్ ధృవీకరణ, గుర్తింపు పత్రాలు, వయస్సు నిర్ధారణకు సంబంధించిన వివరాలు తప్పనిసరిగా ఉండేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. మైనర్లను నిబంధనలకు విరుద్ధంగా పనిలోకి తీసుకోవద్దని ఆదేశించారు.

**ప్రముఖుల పేర్లు చెప్పినా మినహాయింపు ఉండదు**

హోటల్స్, పబ్స్, రెస్టారెంట్లలో వినియోగదారుల ప్రవర్తనపై యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ సూచించారు. రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులమని లేదా ప్రముఖుల బంధువులమని చెప్పుకుని సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించినా, నిబంధనలు ఉల్లంఘించినా ఎలాంటి ప్రత్యేక మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. లిచట్టం అందరికీ సమానమేననిలి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**డ్రగ్స్ నియంత్రణకు సహకరించాలి**

బార్లు, పబ్స్‌లో గ్యాంగ్‌ల మధ్య గొడవలు, ఘర్షణలకు అవకాశం లేకుండా యాజమాన్యాలు ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీ సూచించారు. ఇలాంటి ఘటనలు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాయని తెలిపారు. మాదకద్రవ్యాలు, ఇతర నిషేధిత పదార్థాల వినియోగం, విక్రయాలను అరికట్టేందుకు పోలీసులకు యాజమాన్యాలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

**హుక్కా కార్యకలాపాలపై కఠిన చర్యలు**

తెలంగాణలో హుక్కా కార్యకలాపాలు నిషేధించబడిన నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ హుక్కా సెంటర్లు నిర్వహించరాదని సీపీ స్పష్టం చేశారు. జూూరా చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ హుక్కా కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే గరిష్ఠంగా 7 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. వ్యాపారాలను అడ్డుకోవడం సైబరాబాద్ పోలీసుల లక్ష్యం కాదని సీపీ పేర్కొన్నారు. చట్టబద్ధంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు నిర్వహించే వారికి పోలీసులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. అయితే నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై మాత్రం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఐపీఎస్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీఎస్, కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్, శేరిలింగంపల్లి డీసీపీ సీ. హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్, ఎస్‌ఓటీ డీసీపీ శోభన్ కుమార్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# నెల్లూరు నుంచి నేరుగా తిరుమల వెళ్లిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

**నెల్లూరు పర్యటన ముగించుకుని తిరుమల శ్రీవారిని దర్శించుకున్న యూపీ సీఎం యోగి**

**వెంకయ్య నాయుడు ఉత్తర, దక్షిణ భారతాలకు సాంస్కృతిక వారధి అని ప్రశంస**

**స్వర్ణ భారత్ ట్రస్ట్ 25 ఏళ్ల సేవలను కొనియాడిన యోగి ఆదిత్యనాథ్**

**గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ట్రస్ట్ నెలకొల్పామన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

**తన పిల్లలను రాజకీయాలకు దూరం పెట్టానని, సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాలని కోరిన వెంకయ్య**







ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అంతకుముందు నెల్లూరు జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అక్కడి నుంచి నేరుగా తిరుమల చేరుకున్నారు. తిరుమలకు విచ్చేసిన యోగికి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన ఆయన, స్వామివారి దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు యోగి ఆదిత్యనాథ్‌కు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు ఆయనను శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. యూపీ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

**స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రస్థానం ఆదర్శనీయం: యోగి**

అంతకుముందు, యోగి ఆదిత్యనాథ్ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రాంగణంలో జరిగిన 'స్వర్ణ భారత్–సేవా హారతి' రజతోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా ట్రస్ట్ చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. వెంకయ్య నాయుడు రాజ్యసభ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు అందరినీ ఐక్యంగా ముందుకు నడిపారని, ఉత్తర, దక్షిణ భారతాలకు సాంస్కృతిక వారధిగా నిలిచారని ప్రశంసించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ఇతర ప్రాంతాలకు పరిచయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. ప్రధాని మోదీ లక్ష్యమైన 'వికసిత్ భారత్' ఆవిష్కరణకు స్వర్ణ భారత్ ట్రస్ట్ సేవలు దోహదపడుతున్నాయని తెలిపారు.







**గ్రామీణాభివృద్ధే మా లక్ష్యం: వెంకయ్య నాయుడు**

ఈ కార్యక్రమంలో మాట్లాడిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గ్రామీణ భారతం పురోగమించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ లక్ష్యంతోనే స్వర్ణ భారత్ ట్రస్ట్‌ను నెలకొల్పినట్లు తెలిపారు. యువత తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే నిజమైన సాధికారత అని పేర్కొన్నారు. తన కుమార్తె దీపా వెంకట్‌కు ట్రస్ట్ బాధ్యతలు అప్పగించానని, కుమారుడు హర్షవర్ధన్ ఫౌండేషన్ ద్వారా సేవ చేస్తున్నారని వివరించారు. తన పిల్లలను రాజకీయాల వైపు ప్రోత్సహించలేదని, అయితే వారి సేవా కార్యక్రమాలను అందరూ ప్రోత్సహించాలని కోరారు. ఈ వేడుకల్లో ఏపీ మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ట్రస్ట్ ఛైర్మన్ కామినేని శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య ఉదయం
ప్రతి పదం... ప్రజా శ్రేయస్కరం
తెలుగు దిన పత్రిక
మంగళవారం 08 - 09 - 2026

# దుగరాజపట్నం మెగా మారిటైం ప్రాజెక్టులో కీలక ముందడుగు

**డీపీఆర్' తయారీకి ఏడు దిగ్గజ సంస్థలు పోటాపోటీ**

**దుగరాజపట్నం మెగా మారిటైం ప్రాజెక్టు నిర్మాణంలో మరో కీలక ముందడుగు**

**పోర్టు, షిప్‌బిల్డింగ్, నౌకల మరమ్మతు క్లస్టర్ డీపీఆర్ కోసం ఏడు దిగ్గజ సంస్థలు**

**బిడ్‌ల పరిశీలన అనంతరం ఎల్-1 సంస్థ ఎంపిక**

**దుగరాజపట్నం మెగా మారిటైం ప్రాజెక్టు నిర్మాణంలో మరో కీలక ముందడుగు**



దుగరాజపట్నం మెగా మారిటైం ప్రాజెక్టు నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. పోర్టు, షిప్‌బిల్డింగ్, నౌకల మరమ్మతు క్లస్టర్ ఐకోసం ఏడు దిగ్గజ సంస్థలు బరిలోకి దిగాయి. టెక్నికల్ బిడ్‌ల పరిశీలన అనంతరం ప్రైస్ బిడ్ ఆధారంగా ఎల్-1 సంస్థను ఎంపిక చేయనుండగా ఎంపికైన కన్సల్టెంట్ 15 నెలల్లో సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని నిబంధన పెట్టారు. 2,200 ఎకరాల్లో నేషనల్ షిప్‌బిల్డింగ్, హెవీ ఇండస్ట్రీస్ పార్కుతో పాటు పోర్టు, షిప్‌యార్డు, డ్రైడాక్స్ వంటి సదుపాయాలకు అవసరమైన మాస్టర్‌ప్లాన్ రూపుదిద్దుకోనుంది. డీపీఆర్ కోసం ఏడు దిగ్గజ సంస్థలు పోటీ దుగరాజపట్నం మారిటైం ప్రాజెక్టు డీపీఆర్ రూపకల్పనకు ఏపీ మారిటైమ్ బోర్డు జారీ చేసినా ఏడు సంస్థలు స్పందించాయి. టెక్నికల్ బిడ్‌ల మూల్యాంకనం పూర్తయ్యాక అర్హత సాధించిన సంస్థల ఫైనాన్షియల్ బిడ్‌లను తెరిచి ఎల్-1 ఖరారు చేయనున్నారు. పోటీలో రాయల్ హాస్కోనింగ్, ఏఈకామ్, టాటా కన్సల్టింగ్ ఇంజినీర్స్, ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్, డబ్ల్యూఎస్‌పీ, ట్రాక్టెబెల్ వంటి అంతర్జాతీయ, జాతీయ స్థాయి సంస్థలు ఉన్నాయి. పోర్టులు, మెరైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, షిప్‌బిల్డింగ్ రంగాల్లో వీటి అనుభవాన్ని తయారీలో వినియోగించనున్నారు. ఇప్పటికే ఉన్న అధ్యయనాలు, నివేదికలు, ప్రణాళికలను సమీక్షించడంతో పాటు క్షేత్రస్థాయి డేటాను సేకరించాల్సి ఉంది. భవిష్యత్ కార్గో రాకపోకలు, నౌకల పరిమాణం, భూసంబంధ పరిస్థితులు, ఇంజినీరింగ్ అవసరాలపై సమగ్రపైనా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. డ్రాఫ్ట్, డ్రెడ్జింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి ప్రాజెక్టులో బ్రేక్‌వాటర్లు, బెర్తులు, షిప్‌యార్డు, వర్క్‌షాప్‌లు, డ్రైడాక్స్ నిర్మాణాలకు సంబంధించిన సాంకేతిక నమూనాలు రూపొందించనున్నారు. ఒక్కో మౌలిక వసతికి అయ్యే వ్యయం, మొత్తం పెట్టుబడి అవసరాలను కూడా ఖూ=లో లెక్కించనున్నారు. పోర్టు ఆర్థికంగా ఎంతవరకు అవసరమో నిర్ధారించేందుకు ప్రస్తుత, భవిష్యత్ షిప్పింగ్, వాణిజ్య, కార్గో డిమాండ్‌ను అంచనా వేయనున్నారు. సముద్రంలో అందుబాటులో ఉన్న లోతు, అవసరమైన డ్రాఫ్ట్, డ్రెడ్జింగ్ వ్యయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. షిప్‌బిల్డింగ్, రిపేర్ కార్యకలాపాలకు భవిష్యత్‌లో ఎలాంటి నౌకలకు డిమాండ్ ఉంటుందో కూడా అధ్యయనం చేయాలి. నౌకల రకాలు, సంఖ్య, కార్గో రవాణా, వెసెల్ మూవ్‌మెంట్స్‌ను అంచనా వేసి అందుకు అనుగుణంగా క్లస్టర్ సామర్థ్యాన్ని నిర్ణయించనున్నారు. సమగ్ర పారిశ్రామిక ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు ఇప్పటికే రైట్స్ రూపొందించిన టెక్నికల్ అండ్ ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్ట్ కూడా తదుపరి అధ్యయనానికి ఆధారంగా ఉండనుంది. సముద్ర ఇసుక ప్రవాహం, అలల ప్రభావం, తీరప్రాంత మార్పులు, హార్బర్ పరిస్థితులపై అందులోని అధ్యయనాలను డీపీఆర్‌లో పరిగణనలోకి తీసుకోనున్నారు. ప్రాజెక్టు అమలుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రీన్‌ఫీల్డ్ షిప్‌బిల్డింగ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందుతున్నాయి. పోర్టు ఆధారిత పరిశ్రమలు, షిప్‌బిల్డింగ్, రిపేర్ కార్యకలాపాలతో పాటు అనుబంధ పరిశ్రమలకు అనుకూలమైన సమగ్ర పారిశ్రామిక ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

# గతితప్పిన జీవన శైలికి 'సంజీవని' యాప్ ఇంటి దగ్గరే యోగా, ఆరోగ్య సూత్రాలపై అవగాహన

**ప్రజల్లో ఆరోగ్యకర జీవనశైలిపై మరింత అవగాహన పెంచాలని నిర్ణయించిన ప్రభుత్వం**

**'సంజీవని' యాప్‌లో యోగా, ప్రకృతి చికిత్సల వీడియోలు, ఆరోగ్యకర జీవనశైలికి ఉపకరించే వ్యాసాలు అందుబాటులోకి తెచ్చేలా కసరత్తు**

**ఇంటి దగ్గరే యోగా సాధన చేసేలా వీడియోలు, ఆరోగ్యకర జీవనశైలికి వ్యాసాలు**



గతితప్పిన జీవన శైలి, దీర్ఘకాలిక వ్యాధులతో ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది. దీంతో ప్రజల్లో ఆరోగ్యకర జీవనశైలిపై మరింత అవగాహన పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏఐ ఆధారిత డిజిటల్ ఆరోగ్య సేవల వ్యవస్థ 'సంజీవని'తో ఆయుష్ విభాగాన్ని అనుసంధానం చేసేలా చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఆయుష్ శాఖ దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ లక్ష్యంగా తొలిదశ ప్రణాళిక సిద్ధం చేసింది. 'సంజీవని' యాప్‌లో యోగా, ప్రకృతి చికిత్సల సేవలకు సంబంధించిన ప్రామాణిక వీడియోలు, ఆరోగ్యకర జీవనశైలికి ఉపకరించే వ్యాసాలు అందుబాటులోకి తెచ్చేలా కసరత్తు చేస్తోంది. సంజీవని యాప్ ద్వారా ప్రజలందరికీ ఈ సేవలు చేరువ చేసేలా చర్యలు చేపడుతోంది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రారంభం కానున్న నేపథ్యంలో అదే సయమానికి యాప్ ద్వారా యోగా, ప్రకృతి వైద్యసేవలూ ప్రజలకు అందుబాటులోకి తేనున్నారు. ప్రకృతి సూత్రాలకు అనుగుణంగా జీవనశైలి యోగా, ఆరోగ్యకర ఆహార అలవాట్లు ప్రజల జీవన విధానంలో భాగం చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ప్రకృతి సూత్రాలకు అనుగుణంగా నేచురోపతి ఆధారిత జీవనశైలిని ప్రజలకు అలవర్చేలా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో యోగా, నేచురోపతి సంస్థలతో చర్చించి అభిప్రాయాల సేకరణకు భాగస్వామ్య సదస్సు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. అసాంక్రమిక వ్యాధుల కట్టడి దిశగా అడుగులు అసాంక్రమిక వ్యాధుల కట్టడి దిశగా ఆయుష్ శాఖ తొలి దశ ప్రణాళిక రూపొందించింది. రక్తపోటు, టైప్-2 మధుమేహం, ప్రీ-డయాబెటిస్, ఊబకాయం, మెటబాలిక్ సింగ్రోమ్, గుండె సంబంధిత వ్యాధుల ముప్పు, రక్తంలో కొలెస్ట్రాల్ సమస్యలు, దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలు, కండరాల సమస్యలు, మానసిక ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి, జీర్ణవ్యవస్థ తదితర దీర్ఘకాలిక వ్యాధులు, జీవనశైలి రుగ్మతలపై దృష్టి సారించింది. ఇళ్ల దగ్గర్నుంచే సులువుగా అర్థం చేసుకుని సాధన ముందుగా మధుమేహం నివారణ, నియంత్రణకు యోగా, ప్రకృతి చికిత్స జీవనశైలి మార్పులతో కూడిన ప్రత్యేక వీడియో మాడ్యూల్‌ను ఆయుష్ శాఖ సిద్ధం చేసింది. తర్వాత దశల వారీగా మిగిలిన వ్యాధులకు సంబంధించినవీ రూపొందించి యాప్ ద్వారా విడుదల చేస్తారు. ఇలా ప్రజలు ఇళ్ల దగ్గర్నుంచే సులువుగా అర్థం చేసుకుని సాధన చేసేలా వ్యాధి ఆధారిత యోగా వీడియోలు, ఆరోగ్య సూత్రాలు సులువుగా అర్థమయ్యే రీతిలో అందుబాటులోకి తేనున్నారు. ఆసనాలు, ప్రాణాయామ పద్ధతులు, ధ్యానం, విశ్రాంతి పద్ధతులు, యోగ నిద్ర, రోజువారీ జీవనశైలి సాధన మార్గదర్శకాలు ప్రజలకు చేరువ చేస్తారు.

# ప్రయాణికులకు గుడ్ న్యూస్ మెట్రో-ఆర్టీసీ ప్రయాణానికి ఉమ్మడి పాస్

**మెట్రో రైలులో ప్రయాణించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్**

**ఓల్డ్ సిటీలో మెట్రో కారిడార్ విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సూచన**

**మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి పాస్ వెంటనే ప్రవేశపెట్టాలని ఆదేశం**

**మెట్రో రైల్, ఆర్టీసీ బస్సు ప్రయాణానికి ఉమ్మడి పాస్**




హైదరాబాద్ నగరంలో మెట్రో రైల్, ఆర్టీసీ బస్సు ప్రయాణానికి ఉమ్మడి పాస్‌ను వెంటనే ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ప్రజలకు సౌలభ్యంగా ఉండేలా నెలవారీ, రోజువారీ పాస్ లను జారీ చేయడానికి ఏర్పాట్లు చేయాలని మెట్రో, ఆర్టీసీ అధికారులకు స్పష్టం చేశారు. బేగంపేట్ మెట్రో రైల్ భవన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇవాళ హెచ్ఎంఆర్ఎల్, టీజీఎస్ఆర్టీసీ, విద్యుత్ శాఖ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. విస్తరణ పనులు వేగవంతం చేయాలి హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, మెట్రో అదనపు ఎండీ అజిత్ రెడ్డి, జాయింట్ ఎండీ శివేంద్ర ప్రతాప్ ఇప్పటి వరకు హైదరాబాద్ మెట్రో మొదటి, రెండవ దశల్లో చేపట్టిన వివిధ చర్యలను సీఎస్‌కు వివరించారు. పాతనగరంలో (ఓల్డ్ సిటీ) 7.5 కిలోమీటర్ల మెట్రో కారిడార్ కోసం రోడ్ విస్తరణ పనుల తాజా స్థితిగతులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అడిగి తెలుసుకున్నారు. జనరల్ కన్సల్టెన్సీ నియామకానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రస్తుత స్థితిని అధికారులు వివరించారు. విస్తరణ పనులు వేగవంతం చేయాలని, త్వరితగతిన మెట్రో పనులు ప్రారంభం కావాలని సీఎస్ ఆదేశించారు. వెంటనే పాస్‌ల విధానాన్ని అమలు చేయాలి అనంతరం సీఎస్ సంజయ్ జాజు బేగంపేట్ నుంచి పారడైజ్ వరకు మెట్రో రైల్‌లో ప్రయాణించారు. ఆయనతో పాటు ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి కూడా ప్రయాణం చేశారు. స్టేషన్లలో వాణిజ్య సముదాయాలను, పార్కింగ్ స్థలాలను అయన పరిశీలించి, వాటిని మరింత అభివృద్ధి చేయడానికి తగు సూచనలు చేశారు. ప్రయాణికులకు అందుతున్న సేవలను పరిశీలించారు. మెట్రో ఆర్టీసీ ప్రయాణీకులకు ఉమ్మడి పాస్ జారీ చేయడానికి సాంకేతికపరంగా సిద్ధంగా ఉన్నామని ఆదేశించిన తక్షణమే అమలు చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎల్ అండ్ టీ, హైదరాబాద్ మెట్రో రైల్, ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. ఉమ్మడి చార్జీలను త్వరితగతిన ఖరారు చేసి వెంటనే పాస్‌ల విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. ఎలివేటెడ్ కారిడార్లను పరిశీలించిన సీఎస్ ప్యారడైజ్ జంక్షన్ వద్ద ఉన్న ఎలివేటెడ్ కారిడార్, ఓఆర్ఆర్ జంక్షన్ వరకు ఎస్‌హెచ్-1 (రాజీవ్ రహదారి)పై ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్‌లు అందుబాటులోకి వస్తే ప్యారడైజ్, సికింద్రాబాద్, బొల్లారం, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, శామీర్‌పేట్ తదితర ప్రాంతాల మధ్య రవాణా కనెక్టివిటీ మరింత మెరుగుపడుతుందని సంజయ్ జాజు పేర్కొన్నారు. ఉత్తర హైదరాబాద్ ప్రాంతం నుంచి ఓఆర్ఆర్‌కు వేగవంతమైన అనుసంధానం ఏర్పడటంతో పాటు, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఈ కారిడార్లు దోహదపడతాయన్నారు. ప్యారడైజ్ జంక్షన్ వద్ద ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్లను సీఎస్ పరిశీలించారు. సర్ఫరాజ్ అహ్మద్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రతిపాదిత కారిడార్ల అలైన్‌మెంట్, కనెక్టివిటీ, భూసేకరణ, మౌలిక వసతుల అవసరాలను ఆయన పరిశీలించారు. కారిడార్‌లను సమగ్రంగా అభివృద్ధి చేయాలి ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫార్మ్ రోడ్ వరకు ఎన్‌హెచ్-44పై, ప్యారడైజ్ నుంచి బొల్లారం, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, శామీర్‌పేట్ మీదుగా ఓ.ఆర్.ఆర్ జంక్షన్ వరకు ఎస్‌హెచ్-1 (రాజీవ్ రహదారి)పై ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్‌లకు సంబంధించిన ప్రణాళికలను అధికారులు సంజయ్ జాజుకు వివరించారు. ప్రత్యేకించి సికింద్రాబాద్--బొల్లారం--శామీర్‌పేట్ మార్గంలో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కారిడార్‌లను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సీఎస్ అధికారులకు స్పష్టం చేశారు. వేగంగా పరిష్కరించాలి ఈ కారిడార్లతో ప్యారడైజ్, బొల్లారం, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, శామీర్‌పేట్ పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు, ప్రయాణ సమయాన్ని తగ్గించవచ్చన్నారు. ప్రాజెక్టు అమలులో భూసేకరణ, యుటిలిటీల మార్పిడి, వివిధ శాఖల మధ్య సమన్వయం, అవసరమైన అనుమతులు తదితర అంశాలను వేగంగా పరిష్కరించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎలివేటెడ్ కారిడార్లతో పాటు మెట్రో రైలు, ప్రధాన రహదారులు, ఓఆర్ఆర్ మధ్య మెరుగైన అనుసంధానం ఏర్పడేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు.

# భాగ్యనగరంలో మారనున్న పోలీసింగ్ ముఖచిత్రం త్వరలో కొత్త ఠాణాల ఏర్పాటు

**హైదరాబాద్ నగరంలో త్వరలో కొత్త ఠాణాల ఏర్పాటు**

**భౌగోళిక సరిహద్దుల్లోనూ మార్పులుచేర్పులు**

**ఇటీవలే హైదరాబాద్, సైబరాబాద్, మాల్కాజిగిరి, ఫ్యూచర్‌సిటీ కమిషనర్లతో సమీక్షించిన డీజీపీ**




భాగ్యనగర పోలీసింగ్ ముఖచిత్రం మరోసారి మారబోతోంది. నగరంలోని నాలుగు పోలీస్ కమిషనరేట్లలో త్వరలో కొత్త పోలీస్ స్టేషన్లు రాబోతున్నాయి. హైదరాబాద్ నగరం వేగంగా విస్తరించడం, శివారు ప్రాంతాల్లో జనాభా సంఖ్య అనూహ్యంగా పెరగడంతో పాటు అదే రీతిలో నేరాల సంఖ్య పెరుగుతోంది. దీనికితోడు నగరంలోని కొన్ని పోలీస్ స్టేషన్ల పరిధి విషయంలో సమస్యలున్నాయి. వీటన్నింటికీ పరిష్కారంగా కొత్త వాటితోపాటు ఇప్పటికే ఉన్న కొన్ని పోలీస్ స్టేషన్లు(ఠాణాలు), డివిజన్లు, జోన్ల పరిధిలో మార్పుచేర్పులు జరగనున్నట్లుగా తెలుస్తోంది. త్వరలోనే ఇందుకు సంబంధించిన ఆర్డర్స్ వచ్చే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు. పునర్వ్యభజనపై అధికారుల కసరత్తు ప్రక్రియ పూర్తయింది. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఇటీవల హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్‌సిటీ కమిషనర్లతో సమీక్షించి పలు కీలక సూచనలు చేశారు. పురపాలికలు, రెవెన్యూ డివిజన్లు, కోర్టుల పరిధిని పరిగణనలోకి తీసుకుని హద్దులు నిర్ణయించాలన్నారు. ముఖ్యంగా నగర శివారు ప్రాంతాల్లోనే మార్పుచేర్పులు అధికంగా ఉంటాయని తెలుస్తోంది. గందరగోళంగా విభజన 2023 జూన్ నెలలో తెలంగాణ సర్కారు హైదరాబాద్ నగరంలో కొత్త ఠాణాలు ఏర్పాటు చేసింది. అప్పటికి మూడు కమిషనరేట్లలోకలిపి మొత్తం లాఅండ్ ఆర్డర్ పీఎస్‌ల సంఖ్య 146కు చేరింది. గతేడాది డిసెంబరు నెల చివరివారంలో రాజధానిలోని పోలీస్ కమిషనరేట్లను సర్కారు మరోసారి పునర్వ్యవస్థీకరించింది. సరిహద్దుల్ని భారీగా మార్చి కొత్తగా ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ విభజనపై కొంత గందరగోళం ఏర్పడటంతో అధికారులు పెదవి విరుస్తున్నారు. కొన్ని జోన్లలో 10, అంతకంటే ఎక్కువ పోలీస్ స్టేషన్లు ఉంటే ఇంకొన్ని జోన్లలో ఆరే ఉన్నాయి. ఉదాహరణకు మల్కాజిగిరి కమిషనరేట్‌లోని మల్కాజిగిరి జోన్‌లో ఏకంగా 15 పీఎస్‌లు ఉన్నాయి. దీని భౌగోళిక పరిధి విస్తృతంగా ఉందని చెప్పవచ్చు. సికింద్రాబాద్‌లోని మార్కెట్, తుకారాంగేట్ నుంచి శివారులోని కీసర, శామీర్‌పేట్ తదితర ప్రాంతాలు ఈ జోన్ పరిధిలోనే ఉన్నాయనే విషయం తెలిసిందే. భారీ కార్యక్రమాలతో పాటు, రాష్ట్రస్థాయి ప్రముఖులు పర్యటనకు వచ్చిన సందర్భంలో బందోబస్తు ఏర్పాట్లు కోసం ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి సిబ్బందిని తరలించడం చాలా కష్టసాధ్యమైన పని అని అధికారులు చెబుతున్నారు. అదే సమయంలో ఉప్పల్, ఎల్బీనగర్ జోన్లలో 7 పోలీస్ స్టేషన్ల చొప్పున నిర్దిష్ట పరిధిలో ఉన్నాయి. సైబరాబాద్‌లోని శేరిలింగంపల్లి, ఫ్యూచర్‌సిటీలోని మహేశ్వరం జోన్లపరిధిలో భారీగా ఉంది. పేర్ల విషయంలోనూ కొంత గందరగోళంఉంది. శంషాబాద్ జోన్ హైదరాబాద్ కమిషనరేట్‌లో విలీనం చేశారు. అదే పేరుతో ఉన్న శంషాబాద్ పీఎస్ మాత్రం ఫ్యూచర్‌సిటీ కమిసరేట్ పరిధిలో ఉండనున్నట్లు సమాచారం. శివారుప్రాంతాల్లోనే అధికం కొత్త పోలీస్‌స్టేషన్లు(పీఎస్) ఎక్కువగా శివారు ప్రాంతాల్లోనే రాబోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మొయినాబాద్ ఠాణా పరిధిలోని అజీజ్‌నగర్ కేంద్రంగా ఒక ఠాణా రాబోతుంది. రోజురోజుకు పెరుగుతున్నటువంటి జనాభా, విస్తరిస్తున్న నగర శివారును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. మొయినాబాద్ కేంద్రంగా ఒక డివిజన్ ఏర్పాటవుతోందని సమాచారం. నార్సింగి పోలీస్‌స్టేషన్‌ను విభజించి కోకాపేట లేదా మరో పేరుతో పీఎస్‌ను ఏర్పాటు చేయనున్నట్లుగా సమాచారం. ఐటీ కారిడార్ ప్రాంతంలో, కొండాపూర్ లేదా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పేరుతో ఒకటి రాబోతున్నట్లు తెలుస్తోంది. మీర్‌పేట పీఎస్‌ను విభజించి బడంగ్‌పేట్ పేరుతో పోలీస్‌స్టేషన్ రాబోతోంది. అలాగే మౌలాలి, బోడుప్పల్ తదితర పేర్లు ప్రతిపాదనలో ఉన్నాయి. ట్రాఫిక్ ఠాణాలు సైతం కొత్తవి ఏర్పాటు ఏర్పాటు కానున్నాయి.ా

# పర్యాటక ప్రాంతంగా వెలిగొండ ప్రాజెక్టు కృష్ణమ్మ పరుగులు తిలకించేందుకు తరలివస్తున్న జనం

**కృష్ణమ్మ పరుగులు పెడుతుండడంలో వెలిగొండ ప్రాంతానికి పర్యాటక శోభ**

**జల ధారలను కళ్లారా చూసేందుకు ప్రజల ఆసక్తి**

**పర్యాటక శోభ సంతరించుకున్న వెలిగొండ ప్రాజెక్టు**




కరవు సీమలో కృష్ణమ్మ పరుగులు పెడుతుండడంలో వెలిగొండ ప్రాంతానికి పర్యాటక శోభ సంతరించుకుంది. ప్రాజెక్టు సందర్శనకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. కృష్ణ జలాలకు జలహారతి, పూజలు నిర్వహిస్తున్నారు. కళ్లారా చూసేందుకు మార్కాపురం జిల్లా దోర్నాల మండలం కొత్తూరు సమీపంలో ఉన్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఆ జిల్లా ప్రజల దశాబ్దాల కల. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే కరవు కాటకాలతో అల్లాడుతున్న తమ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని ఏళ్ల తరబడిగా ఎదురు చూస్తూ ఉన్నారు. ఈ కలను కూటమి ప్రభుత్వం సాకారం చేసింది. గత నెల 31 న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేశారు. జంట సొరంగాల నుంచి వస్తున్న కృష్ణమ్మను ఫీడర్ కెనాల్ ద్వారా నల్లమల సాగర్ డ్యాంలో నింపుతున్నారు. ఆ జల ధారాలను కళ్లారా చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. కృతజ్ఞతగా కృష్ణమ్మకు పూజలు వెలిగొండ ప్రాజెక్టు సందర్శనకు మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున కూటమి నాయకులు, రైతులు, మహిళలు యువకులు తరలివస్తున్నారు. కృతజ్ఞతగా కృష్ణమ్మకు పూజలు చేస్తున్నారు. పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా వస్తున్నారు. దోర్నాల మండలం గంటవానిపల్లె దగ్గర ఉన్న వెలిగొండ ప్రాజెక్టు పైలాన్, ప్రాజెక్టు గేట్లు, జలహారతి ప్రదేశం, నీటి ప్రవాహాలు. శిలా ఫలకాలు, నీటి నిల్వలు తదితర సుందరమైన దృశ్యాలను తిలకిస్తున్నారు. కృష్ణమ్మ పరవళ్లను తమ చరవాణిలో బంధిస్తూ సెల్ఫీలు తీసుకుంటూ సంతోషంగా గడుపుతున్నారు. ప్రారంభించిన మరుసటి రోజు నుంచే ఈ ప్రాజెక్టు వద్ద 20 రోజులపాటు జల హారతి, ప్రత్యేక పూజలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. సీఎం చంద్రబాబు ప్రాజెక్టును ప్రారంభించిన మరుసటి రోజు నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అక్కడ ప్రత్యేక పూజారి ఉండడంతో అక్కడికి వెళ్లిన వారు జలహారతి, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎన్నో దశాబ్దాల నుంచి కలలు కన్న ప్రాజెక్టు తమ కళ్లముందే ప్రవహిస్తుంటే ఆనందంతో మురిసిపోతున్నారు. ప్రాజెక్టు సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీస్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

# నా చీర లాగేశారు.. అసెంబ్లీ గేటు వద్ద సునీతా లక్ష్మారెడ్డి కన్నీరు

**ఘటనపై ఫిర్యాదు చేస్తానన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన కాలికి గాయమైందని వెల్లడి**

**నల్ల దుస్తులతో అసెంబ్లీకి బీఆర్ఎస్ నేతలు నేతలను గేటు వద్ద అడ్డుకున్న సిబ్బంది**

**కేటీఆర్, జగదీశ్‌రెడ్డికి గాయాలైనట్లు ఆరోపణ**



తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నల్ల దుస్తులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ నేతలను గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తన చీర లాగేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. తన కాలికి కూడా గాయమైందని చెప్పారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు నల్ల షర్టులు, మహిళా నేతలు నల్ల చీరలు ధరించి అసెంబ్లీకి వచ్చారు. అయితే వారికి ప్రవేశం లేదంటూ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో నేతలు అక్కడే నిరసనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తన చీర లాగడం బాధ కలిగించిందని సునీతా లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఉన్న మహిళలకే రక్షణ లేకపోతే బయట ఉన్న మహిళలకు వీళ్లు ఏం రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. తన కాలికి గాయమైందని తెలిపారు. తాము అసెంబ్లీకి వస్తే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్న భయంతోనే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ాుమరోవైపు అసెంబ్లీ గేటు వద్ద జరిగిన తోపులాటలో కేటీఆర్, జగదీశ్‌రెడ్డికి గాయాలైనట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. దీంతో అసెంబ్లీ ప్రాంగణంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

# అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ బిగ్ ఫైట్.. కేటీఆర్ అరెస్టు, టీషర్ట్ విప్పేసిన హరీశ్ రావు

**కేటీఆర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్-పోలీసుల మధ్య తోపులాట**

**పలువురు నేతలు టీషర్టులు విప్పి నిరసన నేతలకు గాయాలైనట్లు బీఆర్ఎస్ ఆరోపణ**

**కౌశిక్‌రెడ్డి సహా నేతలతో పోలీసుల వాగ్వాదం**



తెలంగాణ అసెంబ్లీ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం కాస్తా తోపులాటకు దారితీసింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు పార్టీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావు, సుధీర్‌రెడ్డి, వివేకానందరెడ్డి సహా పలువురు నేతలు టీషర్టులు విప్పేసి నిరసన తెలిపారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బ్లాక్ డ్రెస్‌లో అసెంబ్లీకి వచ్చారు. అయితే నల్ల దుస్తులతో లోపలికి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను అసెంబ్లీలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో ఎమ్మెల్యేలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి సహా పలువురు నేతలు పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నేతలకు గాయాలైనట్లు ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. హరీశ్‌రావు, సుధీర్‌రెడ్డి, వివేకానందరెడ్డి సహా పలువురు నేతలు టీషర్టులు విప్పేసి నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తప్పా? అని నిలదీశారు. ఎన్నికల హామీల అమలుపై ప్రశ్నించకుండా తమను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. టీషర్టులు ధరించడంపై పోలీసులు అభ్యంతరం చెప్పడాన్ని కూడా బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. రాహుల్ గాంధీ టీషర్ట్ ధరిస్తే తప్పు లేనప్పుడు తమకు ఎందుకు అభ్యంతరం చెబుతున్నారని నిలదీశారు. పిల్లలకు ఉద్యోగాలు అడిగితే విద్యార్థులపై పోలీసులు దాడులు చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఇదేం పాలన అంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు. తాజా పరిణామాలతో అసెంబ్లీ ప్రాంగణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ధ్యానంతో దంపతుల మధ్య అనుబంధం!

**రోజుకు 10 నిమిషాల పాటు ఇలా చేయండి!**

**దంపతుల మధ్య హెల్దీ బాండింగ్ కోసం**

**సింపుల్ టిప్స్ సూచిస్తున్న నిపుణులు!**



వ్యాయామాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని అందరికి తెలిసిందే. అలాగే, భావోద్వేగాల్ని అదుపులో ఉంచుతాయి. అయితే, ఇవే వ్యాయామాలు అనుబంధాల్నీ దృఢం చేస్తాయంటున్నారు నిపుణులు. ముఖ్యంగా, ధ్యానం పాజిటివ్ ఆలోచనల్ని రేకెత్తించి, ఎదుటి వ్యక్తిని సానుకూల దృక్పథంతో చూసేలా ప్రేరేపిస్తుందని చెబుతున్నారు. దంపతులిద్దరూ కలిసి ధ్యానం చేసినా, విడివిడిగా చేసినా, ఇది ఇద్దరి మధ్య అనుబంధాన్ని దృఢం చేస్తుందని పేర్కొంటున్నారు. ఆఫీస్ లేదా ఇతర పనుల వల్ల ఒత్తిడి, ఆందోళన సర్వసాధారణం. దీన్ని చాలామంది భాగస్వామిపై చూపిస్తూ ఉంటారు. అయితే, రోజూ ధ్యానం చేయడం వల్ల ఆందోళన, ఒత్తిడి తగ్గిపోతుంది. అలాగే, చిన్న చిన్న విషయాలకే కోపతాపాలకు గురికావడం తగ్గుతుంది. దీంతో ఏ విషయం గురించి అయినా ప్రశాంతంగా ఆలోచించగలుగుతారు. ఈ ప్రశాంతతే భార్యాభర్తలిద్దరి మధ్య ఎలాంటి గొడవలు రాకుండా, ఒకవేళ వచ్చినా వాటిని తగిన పరిష్కార మార్గాలు వెతుక్కునే నేర్పును అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. మనసులోని ప్రతికూల ఆలోచనల్ని దూరం చేయడంలో ధ్యానం కీలక పాత్ర పోషిస్తుందంటున్నారు నిపుణులు. దీనివల్ల పాజిటివిటీని అలవర్చుకోవచ్చట. ఇలా ప్రతిదీ సానుకూల దృక్పథంతో చూడగలుతాం. అంతేకాదు, భాగస్వామి కోణంలో నుంచి పరిస్థితిని అర్థం చేసుకునే సహనం పెరుగుతుంది. వారి మాటలు, భావాల్నీ అర్థం చేసుకోగలుగుతాం. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య పెరిగిన దూరాన్ని దగ్గర చేసుకోవాలంటే ఇదీ ముఖ్యమే. మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు ఇతరులతో సులభంగా కలిసిపోతాం. తద్వారా ఇటు మన మనసులో ఉన్న సమస్యలు, బాధల్ని వారితో పంచుకుంటాం. అలాగే, భాగస్వామి చెప్పేది మధ్యలో అడ్డుపడకుండా, పూర్తిగా వినే ఓపిక పెరుగుతుంది. ఇలా ఇద్దరి మధ్య ఎలాంటి దాపరికాల్లేనప్పుడు అనుబంధంలోనూ ఎలాంటి కలతలు ఉండవని నిపుణులు చెబుతున్నారు. కొన్నిసార్లు దంపతులిద్దరిలో ఎవరికి కోపం వచ్చినా, అవతలి వారు మాట పడరు. దీనివల్ల గొడవ పెద్దదవడం తప్ప మరే ప్రయోజనం ఉండదని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటప్పుడు ఓపికతో వ్యవహరించాలన్నా, భరించే శక్తిని పెంచుకోవాలన్నా ధ్యానం తప్పనిసరని పేర్కొంటున్నారు. క్షమాగుణాన్ని పెంచడంలోనూ ధాన్యం తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. పొరపాటు మీరు చేసినా, అవతలి వారు చేసినా, క్షమాపణ కోరడం, క్షమించగలగడం అలవాటు చేసుకుంటే, బంధం బ్యాలన్స్‌డ్‌గా ముందుకు సాగుతుందట. ఈ క్రమంలో రోజుకు కేవలం 10 నుంచి 15 నిమిషాలు కలిసి ధ్యానం చేయడానికి కేటాయించాలని సూచిస్తున్నారు.

# “ప్రతిసారీ నాకే ఎందుకిలా జరుగుతోంది”


**మనసును వేధించే ‘రుమినేషన్’**

**రుమినేషన్ అంటే ఏమిటి**

**ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసా**



రాత్రి రెండవుతోంది. శరీరం అలసిపోయింది. కానీ, మనసు మాత్రం నిద్రపోనీయకుండా ఒకటే అలజడి, ఆందోళన. గతంలో జరిగిన సంఘటనే మళ్లీ మళ్లీ గుర్తుకొస్తోంది. అప్పుడు ‘నేనలా మాట్లాడకుండా ఉండాల్సింది’, ‘వాళ్లు నా గురించి ఏమనుకున్నారో’, ‘ఎందుకు ప్రతిసారి నా విషయంలో ఇలా జరుగుతుంది’ అని చాలామంది అనుకుంటున్నారు. ఇలా ఒకే విషయం లేదా సంఘటన గురించి అదే పనిగా ఆలోచిస్తూ ఉండటాన్ని సైకాలజీలో ‘రుమినేషన్’ అంటారు. ఈ క్రమంలో రుమినేషన్ అంటే ఏమిటి దీనివల్ల ఎలాంటి మానసిక సమస్యలు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం! మనలో చాలామంది ఒక విషయం లేదా సంఘటనను అప్పటి వరకు మాత్రమే గుర్తుపెట్టుకుంటారు. కానీ, కొంతమంది మాత్రం ఆ విషయం గురించి మళ్లీ మళ్లీ ఆలోచిస్తుంటారు. ఎలాగంటే, జంతువులు ఆహారాన్ని నెమరేసినట్లు, గత జరిగిపోయిన విషయాన్ని పదేపదే గుర్తుకు తెచ్చుకోవడం అన్నమాట. ఇలా ఆలోచించడాన్ని రుమినేషన్ అంటారు. ఇది వారికి తెలియకుండానే అలవాటుగా మారిపోతుంది. పైకి చూడడానికి ప్రశాంతంగా కనిపించినప్పటికీ, లోపం మాత్రం మైండ్ ఒకే సీన్‌ను రిపీట్ మోడ్‌లో ప్లే చేస్తూనే ఉంటుంది. గతంలో ఎదురైన ఒక తిరస్కరణ, ఓటమి, జరిగిపోయిన పొరపాటు, ఎవరో చెప్పిన మాట, అవమానం ఇలా ఏదో ఒకటి మనసులో తిష్ఠ వేసుకుని దానికి సంబంధించిన ఆలోచనలే గిర్రున తిరుగుతుంటాయి. రుమినేషన్‌కి చదువు, మాటతీరు, స్నేహితులు, పెద్దలతోనో అభిప్రాయ భేదాలు కారణం ఏదైనా కావచ్చు. ఈ రోజుల్లో సోషల్ మీడియా కూడా రుమినేషన్‌కి ఒక కారణమవుతుందంటున్నారు నిపుణులు. ‘ఫలానా వాళ్లు ఫేస్‌బుక్‌లో అలా ఎందుకు పోస్ట్ పెట్టారు, ఆ పోస్టు దగ్గర కామెంట్ పెట్టకుండా ఉండాల్సింది’, ‘వాళ్లెందుకు నా పోస్టును లైక్ చేయడం లేదు’ ఇలా ఏదో ఒక విషయం మనసులో నస పెడుతూనే ఉంటుంది. ఈ రుమినేషన్ ఎక్కువైతే ఒత్తిడి పెరుగుతుందంటున్నారు నిపుణులు. తద్వారా నిద్రలేమి, పనుల మీద ఏకాగ్రత తగ్గుతుందట. ఇది ఇలాగే కొనసాగితే దీర్ఘకాలంలో యాంగ్జయిటీ, డిప్రెషన్ ఆత్మన్యూనత లాంటి సమస్యలకు దారితీస్తుంది. ఈ క్రమంలో ఆలోచించడం తప్పు కాదు, అతిగా ఆలోచించడం, సరైన మార్గంలో ఆలోచించాలి. రుమినేషన్‌ని తగ్గించుకోవడం మన చేతిల్లోనే ఉంటుందట. ప్రతి విషయాన్నీ అతిగా ఆలోచించవద్దని నిపుణులు చెబుతున్నారు. జరిగిపోయిన దాన్ని ఎలాగో మార్చలేం కాబట్టి వదిలేయాలని గట్టిగా మనసుకు సర్దిచెప్పుకోవాలి. ఆ ఆలోచనను పుస్తకం లేదా పేపర్ మీద పెట్టడం కూడా కొంత వరకు వదిలించుకోవడానికి తోడ్పడుతుంది. అలాగే, వ్యాయామం చేయడం, ఏదైనా పెద్ద పని కల్పించుకోవడం లాంటివి మనసును వర్తమానంలోకి తెస్తాయి. లేకపోతే కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్‌తో షేర్ చేసుకున్నా దాని ప్రభావం తగ్గుతుంది. ముఖ్యంగా, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటివి లైట్ తీసుకోవాలి. ప్రతి సమస్యకి పరిష్కారం, ముగింపు ఉండవు. కొన్నింటిని కాలానికే వదిలేయాలని నిపుణులు సూచిస్తున్నారు.



# రక్తహీనత సమస్య ఉందా వీటిని తింటే రక్తం ఎక్కువగా తయారవుతుంది

ప్రస్తుతం చాలా మంది రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. ఇది వచ్చేందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. అయితే రక్తహీనత వచ్చేందుకు పోషకాహార లోపమే ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. పోషకాలు లేని ఆహారాన్ని తింటున్నందునే చాలా మందిలో రక్తం తగినంతగా ఉండడం లేదని వారు అంటున్నారు. ముఖ్యంగా ఐరన్ లోపం సమస్య చాలా మందికి వస్తోంది. అలాగే ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరం అయ్యే విటమిన్ బి12 కూడా చాలా మందిలో లోపిస్తోంది. ఇది కూడా రక్తహీనతకు కారణం అవుతోంది. ఈ క్రమంలోనే కేవలం ఐరన్ మాత్రమే కాకుండా విటమిన్ బి12 ఉండే ఆహారాలను కూడా తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. ఇక రక్తహీనత తగ్గాలంటే తీసుకోవాల్సిన ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.



### జున్ను, బ్రౌన్ రైస్..

జున్ను నుంచి మనకు విటమిన్ బి12 పుష్కలంగా లభిస్తుంది. కనుక జున్ను పాలు లభించే అసలు విడిచిపెట్టకుండా తీసుకోండి. జున్నును విటమిన్ బి12కు గొప్ప వనరుగా చెప్పవచ్చు. అదేవిధంగా పాలు, పనీర్‌తోపాటు ఇతర పాల ఉత్పత్తుల్లోనూ విటమిన్ బి12 అధికంగానే ఉంటుంది. ఇది మన శరీరంలో ఎర్ర రక్త కణాలు తయారయ్యేలా చేస్తుంది. దీంతో రక్తహీనత నుంచి బయట పడవచ్చు. అలాగే బ్రౌన్ రైస్‌ను ఎక్కువగా తినాలి. బ్రౌన్ రైస్‌లోనూ మనకు విటమిన్ బి12 సమృద్ధిగానే లభిస్తుంది. ప్రస్తుతం చాలా మంది తెల్ల అన్నాన్ని ఎక్కువగా తింటున్నారు. దీన్ని తినడం వల్ల బరువు పెరగడంతోపాటు డయాబెటిస్ బారిన కూడా పడుతున్నారు. కనుక బ్రౌన్ రైస్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇందులో ఉండే విటమిన్ బి12 రక్తం తయారయ్యేందుకు దోహదపడుతుంది. అలాగే పలు ఇతర పోషకాలు కూడా మనకు లభిస్తాయి.

### పాలకూర జ్యూస్..

రక్తహీనత అధికంగా ఉన్నవారు రోజూ పాలకూరతో జ్యూస్ తయారు చేసి 30 ఎంఎల్ మోతాదులో సేవిస్తుంటే కచ్చితంగా ఫలితం ఉంటుంది. పాలకూర ద్వారా ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది రక్తకణాలు తయారయ్యేలా చేస్తుంది. దీంతో రక్తహీనత నుంచి బయట పడవచ్చు. అదేవిధంగా బీట్‌రూట్ జ్యూస్‌ను రోజూ ఒక కప్పు మోతాదులో తాగుతున్నా కూడా రక్తహీనత నుంచి బయట పడవచ్చు. బీట్‌రూట్‌లో బీటా కెరోటిన్ సమృద్ధిగా ఉంటుంది. అలాగే దీని ద్వారా ఐరన్ కూడా మనకు ఎక్కువగానే లభిస్తుంది. కనుక బీట్‌రూట్ జ్యూస్‌ను తాగుతుంటే రక్తం అధికంగా తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడవచ్చు.

### దానిమ్మ పండ్లు..

దానిమ్మ పండ్లను కూడా ఆహారంలో భాగం చేసుకోవాలి. రోజూ ఈ పండ్లను తింటే రక్తం అధికంగా తయారవుతుంది. లేదా ఈ పండ్ల జ్యూస్‌ను అయినా సరే రోజుకు ఒక కప్పు మోతాదులో తాగుతుండాలి. ఈ పండ్లను తినడం వల్ల శరీరంలో రక్త సరఫరా సైతం మెరుగు పడుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే రోజూ గుప్పెడు కరివేపాకులను దంచి ఆ మిశ్రమాన్ని మజ్జిగలో కలిపి తీసుకుంటుండాలి. దీంతో రక్తాన్ని పెంచుకోవచ్చు. రక్తహీనత తగ్గుతుంది. రక్తం తయారయ్యేలా చేసేందుకు గాను తోటకూర కూడా ఎంతగానో పనిచేస్తుంది. తోటకూరతో జ్యూస్ తయారు చేసి రోజూ తాగవచ్చు. లేదా తోటకూరను కూరగా వండుకుని తింటుండాలి. దీంతో రక్తం తయారవుతుంది. ఇలా పలు రకాల ఆహారాలను తినడం వల్ల విటమిన్ బి12 ఇంకా ఐరన్‌ను పొందవచ్చు. దీంతో రక్తం తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడతారు.

# తాటిబెల్లంలో ఉండే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు రోజూ తినాల్సిందే



మన చుట్టూ ఉండే ప్రకృతిలో ఎన్నో ఆరోగ్యకరమైన ఆహారాలు అందుబాటులో ఉన్నాయి. కానీ చాలా మంది మాత్రం రోజూ అనారోగ్యకరమైన ఆహారాలనే తింటున్నారు. బేకరీ పదార్థాలు, జంక్ ఫుడ్, నూనె పదార్థాలు, స్వీట్లను ఎక్కువగా తింటున్నారు. దీని వల్ల రోగాల బారిన పడుతున్నారు. అయితే ఆరోగ్యకరమైన ఆహారాలను రోజూ తింటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ఎలాంటి రోగాలు రాకుండా చూసుకోవచ్చు. ఇక ప్రకృతి మనకు అందిస్తున్న ఆరోగ్యకరమైన ఆహారాల్లో తాటి బెల్లం కూడా ఒకటి. దీన్ని మనం రహదారుల పక్కన చూడవచ్చు. చాలా మంది తాటిబెల్లాన్ని విక్రయిస్తుంటారు. అయితే తాటి బెల్లంను అది ఉన్న రంగు కారణంగా చాలా మంది ఇష్ట పడరు. కానీ ఇది అందించే ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే తాటి బెల్లంను ఇప్పుడే తినడం మొదలు పెడతారు. అన్ని ఆరోగ్య ప్రయోజనాలను ఇది అందిస్తుంది.

### రక్తహీనతకు ఔషధం..

తాటిబెల్లంలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. దీంతో రక్తం ఎక్కువగా తయారవుతుంది. రక్తహీనత సమస్య ఉన్నవారికి తాటిబెల్లం చక్కని ఆప్షన్ అని చెప్పవచ్చు. రోజువారి ఆహారంలో తాటిబెల్లాన్ని తింటుంటే రక్తహీనత నుంచి బయట పడవచ్చు. అలాగే ఇందులో మెగ్నీషియం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ముఖ్యంగా నరాల బలహీనత తగ్గుతుంది. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు తాటిబెల్లంను ఆహారంలో భాగం చేసుకుంటే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. దీంతో కండరాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. కండరాలు పట్టుకుపోకుండా చూసుకోవచ్చు.

### ఎముకల ఆరోగ్యానికి..

తాటిబెల్లంలో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో ఎముకలు బలంగా మారుతాయి. తాటిబెల్లంలో పొటాషియం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలోకి వస్తుంది. కనుక హైబీపీ ఉన్నవారికి తాటిబెల్లం ఒక వరం అనే చెప్పవచ్చు. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. తాటిబెల్లాన్ని మహిళలు తినడం వల్ల నెలసరి సమయంలో వచ్చే సమస్యలను తగ్గించుకోవచ్చు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్తాన్ని శుద్ధి చేస్తాయి. శరీరంలో దెబ్బ తిన్న కణజాలానికి మరమ్మత్తులు చేస్తాయి. దీంతో స్త్రీలలో వచ్చే సమస్యలు తగ్గుతాయి.

### జీర్ణ సమస్యలకు..

తాటిబెల్లంలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది మలబద్ధకం, అజీర్తి సమస్యలను తగ్గిస్తుంది. శరీరంలోని టాక్సిన్లను బయటకు పంపుతుంది. క్యాన్సర్ కారకాలతో పోరాడి క్యాన్సర్‌ను నివారించే గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. అలాగే తాటిబెల్లంను తింటే పొడి దగ్గు, ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. రోజూ ఒక టీస్పూన్ తాటిబెల్లం తినడం వల్ల మైగ్రెయిన్ నుంచి ఉపశమనం పొందవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. అధిక బరువును తగ్గించేందుకు ఈ బెల్లం ఎంతగానో పనిచేస్తుందని డాక్టర్లు సైతం చెబుతున్నారు. కనుక తాటి బెల్లం మీకు కనిపిస్తే విడిచిపెట్టకుండా కొని తెచ్చి వాడండి. అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# ఉన్నది ఒకటే జిందగీ

సంపాదించడం తెలిసినవాళ్లకు ఖర్చు చేయడంపై కూడా అవగాహన ఉండాలి. లేకపోతే ఆదాయం పేరుకుపోతుంది కానీ, ఆనందం మీకు చిక్కకుండా ఎక్కడో కూరుకుపోతుంది! పొదుపు చేసిన సొమ్ము, మదుపు చేసిన మొత్తం మీ ముందుతరాలకు ఇచ్చేస్తే.. మీ తలరాతకు పరులు కూడా జాలిపడే పరిస్థితి వస్తుంది. జీవిత చరమాంకంలో అయినా, ఖుషీ చేయకపోతే ఎలా ఉన్నది ఒక్కటే జిందగీ! మీ లైఫ్ సుఖాంతం కావాలంటే.. సంపాదించింది ప్లాన్డ్‌గా ఖర్చు చేయడమే మార్గం! ప్రతి మనిషి జీవితం గందరగోళంగానే మొదలవుతుంది. తల్లి కడుపు నుంచి బయటపడగానే ఏడ్చేస్తాం. అది ప్రకృతి ధర్మం కాబట్టి%ా% తెలియకపోయినా పాటిస్తాం. ఆకలి కాగానే తల్లిపాలు తాగుతాం. అది సృష్టివింత కాబట్టి.. తెలియకుండానే చేసేస్తాం. పెరిగి పెద్దయ్యేకొద్దీ మనలో ఆలోచనలు మొదలవుతాయి. చేయాల్సింది చేయకుండా ఉండటానికి ప్రయత్నిస్తాం. చేయకూడనివి చేయాలని తాపత్రయపడతాం. అలా తప్పుల మీద తప్పులు చేస్తూ పెరిగి పెద్దవుతాం. ఏళ్లొచ్చాక ఎక్కడ తప్పు చేసినా చెల్లుతుందేమో కానీ, ఆర్థిక విషయాల్లో పొరపాట్లకు తావిస్తే, జీవితం గ్రహపాటుగా మిగిలిపోతుంది. సంపాదించడం చేతకాని వాళ్లు తప్పు చేసే ఆస్కారం ఉండదు. దురదృష్టాన్ని నిందించుకుంటూ, ఇతరుల అదృష్టంపై ఏడుస్తూ భారంగా కాలం వెళ్లదీస్తుంటారు. వీళ్లను బాగు చేయడం ఎవరి తరమూ కాదు! కానీ, బాధ్యతగా బతుకుతూ, కుటుంబ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తూ, కష్టాలకు ఎదురొడ్డి నిలబడి ఒకస్థాయికి చేరుకుంటారు కొందరు. ఈ క్రమంలో కోరికలు చంపుకుంటారు, కష్టాలకు ఎదురీదుతారు, రూపాయి రూపాయి పోగు చేసి సంపన్నుల జాబితాలో చోటు దక్కించుకుంటారు. జీవితం అంతా కుటుంబం కోసం పనిచేసిన ఈ వ్యక్తులు.. తమకంటూ ఓ లైఫ్ ఉందని అర్థం చేసుకోరు. అలా అర్థం చేసుకున్నవాళ్లు.. ఇదిగో ఈ పార్థసారథి గారిలా జిందగీని ముచ్చటగా ఎంజాయ్ చేస్తారు.



అందుకు ఆయనేం కోట్లు ఖర్చు చేయలేదు. ఒక్కటంటే ఒక్క కోటి రూపాయలు పదిలం చేశాడు. పార్థసారథి ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసేవాడు. పిల్లలను బాగా చదివించాడు. సర్వీసులో ఉన్నప్పుడే పిల్లల పెళ్లిళ్లు అయిపోయాయి. కొడుకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. కూతురు, అల్లుడూ బ్యాంకులో పనిచేస్తారు. రెండేండ్ల కిందట రిటైర్ అయ్యాడు. శేష జీవితం మనవలు, మనవరాళ్లతో ఎంజాయ్ చేయాలని ఫిక్సయ్యాడు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అన్నీ కలిపితే రూ.కోటి దాకా వచ్చాయి. ఈ మొత్తాన్ని ఏం చేయాలో పార్థసారథికి అర్థం కాలేదు. అప్పటికే ఇల్లు ఉంది. ఒకటి రెండు ఆస్తులున్నాయి. పిల్లలకు తండ్రి సొమ్ము కావాలన్న ఆశ లేదు. ‘ఈ కోటి ఏం చేయాలంటూ’ నా సలహా అడిగారు. జీవితం అంతా కష్టపడిన ఆయన్ను ‘ఈ కోటి రూపాయలు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారా’ అని అడిగాను. ముందు కంగారుగా చూసినా.. తర్వాత తేరుకొని ‘ఓ ఎస్’ అన్నారు. ఈ కోటి రూపాయలను కరిగించకుండా.. జీవితాన్ని ఎంజాయ్ చేసే మార్గం ఉందని చెప్పడంతో.. ఆశ్చర్యంగా చూశారు. ఆ కోటి రూపాయలూ హైబ్రిడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయమని చెప్పాను. ఏటా మే 1వ తేదీన ఆ కోటిపై వచ్చే రిటర్న్స్ మొత్తాన్నీ రూపాయి మిగల్చకుండా విత్‌డ్రా చేసి, ఖర్చు చేయాలనే షరతును ఆయన అంగీకరించారు. అలా ఏడాది (2023-24) తిరిగే సరికి ఆ కోటి రూపాయలపై అచ్చంగా రూ.30 లక్షల రిటర్న్స్ వచ్చింది (మ్యూచువల్ ఫండ్స్ మార్కెట్ ఒడుదొడుకులకు లోబడి ఉంటాయి. అన్నిసార్లూ ఇలా రూ.30 లక్షలు వస్తాయన్న గ్యారెంటీ లేదు. కొన్నిసార్లు తక్కువ రావొచ్చు, అసలేం రాకపోవచ్చు కూడా! అయినా ఈ సొమ్ము వెకేషన్ నిమిత్తం కాబట్టి రాకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే దీని మీద ఆధారపడి లేరు కదా!). అంత పెద్ద అమౌంట్‌ను ఏం చేయాలని మళ్లీ అడిగారు. ఫ్యామిలీతో ఇంటర్నేషనల్ వెకేషన్‌కి వెళ్లమని చెప్పాను. కుటుంబంతో పదిరోజులు రెండు దేశాలు చుట్టొచ్చారు పార్థసారథి. అప్పటికీ రూ.30 లక్షల్లో సగమే ఖర్చయ్యాయి. ‘దీన్ని ఏం చేయమంటారు’ అని మళ్లీ సలహా కోరారు. ‘కొడుకు, కోడలు, కూతురు, అల్లుడిని పిల్లలతో సహా డిన్నర్‌కు పిలిచి, ఇకపై నేను ఉన్నంత వరకు మీ పిల్లల చదువు ఖర్చు ఎంతైనా బాధ్యత నాదేనని’ చెప్పమన్నాను! మార్కెట్ క్రాష్ అయినా, దీర్ఘకాలంలో మీ పెట్టుబడి పదిలంగా ఉంటుంది. రిటర్న్స్‌లో కొంత కోత పడుతుందేమో అంతే! తన పూర్తి పరివారంతో ఏడాదికి ఒక దేశం చుట్టేస్తూ జాయ్‌ఫుల్‌గా లైఫ్ ఎంజాయ్ చేస్తున్నారు పార్థసారథి. మనవలు, మనవరాళ్లనూ చదివిస్తూ మలిసంధ్యలో భారం అనుకోకుండా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అందరికీ ఇంత ఈజీగా సొల్యూషన్ దొరక్కపోవచ్చు. కానీ, విదేశాల్లో ‘డై విత్ జీరో’ కాన్సెప్ట్ ఎప్పట్నుంచో ఉంది. పోయేలోపు ఉన్నదంతా ఖర్చు చేసి లైఫ్ ఎంజాయ్ చేయడమన్నమాట. అలాగని జల్సాలకే ఖర్చు పెట్టాలన్న నియమం లేదు. నలుగురికీ సాయం చేయొచ్చు. పదిమంది ఆకలి తీర్చొచ్చు. ఇలా మీ కష్టార్జితం మీ ఇష్టం వచ్చినట్టు వెచ్చించడం అన్నమాట! పార్థసారథి కూడా ఈ సూత్రాన్నే ఎంచుకున్నారు. వారసులకు ఇవ్వాల్సింది ఆస్తుల మూటలు కాదు. మంచి భవిష్యత్తు. బుద్ధిమంతులు ఏ ఆస్తీ ఇవ్వకున్నా.. హాయిగా బతికేస్తారు. బుద్ధిహీనులకు ఏడు తరాలకు సరిపడా ఆస్తి ఇచ్చినా ఊడ్చిపడేస్తారు. సో, మీ కష్టార్జితాన్ని ఎలా వినియోగిస్తారో ఇక మీ ఇష్టం!!

# గుడ్ న్యూస్.. అక్టోబర్ 1 నుంచి కొత్త పింఛన్లు..!



ఏపీ ప్రభుత్వం ప్రజలకు శుభవార్త చెప్పింది. అక్టోబర్ 1 నుంచి కొత్త పింఛన్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద కొత్త లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. పింఛన్లకు సంబంధించి ఈ రోజు నుంచి వారం రోజుల పాటు దరఖాస్తులను తీసుకోనున్నారు. స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని ప్రభుత్వం తెలిపింది. దరఖాస్తుదారుల అర్హతను నిర్ధారించేందుకు 2019 డిసెంబరులో జారీ చేసిన జీవో 174ను అధికారులు ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఇందులో భాగంగా ఆరంచెల తనిఖీ చేపట్ట నున్నారు. వచ్చిన దరఖాస్తులు, వాటి తనిఖీ, అర్హుల ఎంపిక, ప్రభుత్వ ఆమోద ప్రక్రియను 20లో పూర్తి చేస్తారు. ఎవరికి పింఛన్ మంజూరు అయిందో ముందే చెప్పనున్నారు. వారికి అక్టోబరు 1 నుంచి కొత్త పింఛన్లు ఇస్తారు. దరఖాస్తు స్వీకరణ బాధ్యతను సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్/వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శికి అప్పగించినట్లు ప్రభుత్వం పేర్కొంది. హర్హత పొందిన దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించేందుకు వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లేదా వార్డు వెల్ఫేర్ డెవల్‌పమెంట్ సెక్రటరీ వెళ్తారు. ఈ అధికారులు దరఖాస్తుదారుల నివాసాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం వివరాలను ఫారాల్లో నమోదు చేస్తారు. అప్పుడే ఈ కేవైసీ కూడా పూర్తి చేయనున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత అధికారులు తమ లాగిన్‌లలో దరఖాస్తులు, సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసి ప్రభుత్వానికి పంపనున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల దరఖాస్తులను ఎంపీడీవో/మున్సిపల్ కమిషనర్‌కు పంపిస్తారు. ఒంటరి మహిళల దరఖాస్తులను సంబంధిత తహసీల్దారు పరిశీలనకు పంపిన అనంతరం ఎంపీడీవో/మున్సిపల్ కమిషనర్లకు బదిలీ చేయనున్నారు. ాశ్రీంశీ =ఝుං తులం బంగారం అంటే ఎంత.. 10 గ్రాములా.. 11.66 గ్రాములా.. పూర్తి క్లారిటీ ఇదే.. చేనేత కార్మికులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, చర్మకారులు, గీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్ వర్గాల దరఖాస్తులను వారి లాగిన్‌ల ద్వారా సంబంధిత జిల్లాస్థాయి అధికారులకు వద్దకు వెళ్తాయి. వీటిని జిల్లా స్థాయి అధికారి లేదా ప్రత్యేకంగా నియమించిన అధికారి ధ్రువీకరించి లాగిన్లలో వివరాలను అప్‌డేట్ చేసిన తర్వాత ఎంపీడీవో/మున్సిపల్ కమిషనర్లకు పంపనున్నారు. ఏపీలో ఇప్పుడు 61,92,396 మంది ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్లు పొందుతున్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.2,693 కోట్లు కేటాయిస్తోంది. కొత్త పింఛన్లతో ఈ ఖర్చు ఇంకా పెరగనుంది. పింఛన్లకు దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ కార్డు, బియ్యం కార్డు/ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. వీటితో పాటు వితంతు పింఛనుకు - భర్త మరణ ధ్రువీకరణ పత్రం, భర్త ఆధార్ నంబర్ ఉండాలి. ఒంటరి మహిళ పింఛను కోసం అయితే వివాహం అయితే కోర్టు/అదాలత్‌లు జారీ చేసిన విడాకుల పత్రం ఉండాలి. వివాహం కాని వారు అయితే పెళ్లి కానట్లు తహసీల్దారు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. దివ్యాంగుల పింఛను కనీసం 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నట్లు తెలిపే సదరమ్ ధ్రువీకరణ పత్రం ఉండాలి. చేనేత పింఛను, మత్స్యకారుల పింఛను, డప్పు కళాకారుల పింఛను, సంప్రదాయ చర్మకారుల పింఛను, కల్లుగీత కార్మికుల పింఛను కోసం సంబంధిత శాఖలు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం ఉండాలి. బంగారం, వెండి ధరలు తగ్గినా ఈ రేటు వద్దకు వస్తేనే కొనండి.. కీలక సూచన చేస్తున్న ఆర్థిక నిపుణులు.. డిస్క్లైమర్ ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి

# ఎస్‌బీఐ భారీ విస్తరణ.. 12,000 కొత్త ఉద్యోగాలు, 250 కొత్త బ్రాంచ్‌లు

**ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్త ఉద్యోగుల నియామకానికి ఎస్‌బీఐ ప్లాన్**

**క్లరికల్, ఆఫీసర్ కేడర్లలో ఉద్యోగాల భర్తీ**

**దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో కొత్త బ్రాంచ్‌ల ఏర్పాటుకు నిర్ణయం**

**వివరాలను వెల్లడించిన ఎస్‌బీఐ ఛైర్మన్ సి.ఎస్. శెట్టి**




దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిరుద్యోగులకు, బ్యాంకింగ్ ఉద్యోగార్థులకు తీపి కబురు అందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు 12,000 మంది కొత్త ఉద్యోగులను నియమించుకోవడంతో పాటు, దేశవ్యాప్తంగా 250 కొత్త బ్రాంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు.ఈ నియామక ప్రక్రియలో భాగంగా క్లరికల్ (జూనియర్ అసోసియేట్), ఆఫీసర్ (ప్రొబేషనరీ ఆఫీసర్) కేడర్లలో దాదాపు 11,000 నుంచి 12,000 మందిని తీసుకోనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. ఉద్యోగుల పదవీ విరమణలు, బ్యాంకు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ భర్తీ ప్రక్రియ ఉంటుందని ఆయన వివరించారు. గతేడాది (2025-26) బ్యాంకు సుమారు 1,500 మంది ఐటీ స్పెషలిస్ట్ ఆఫీసర్లతో సహా మొత్తం 25,633 మందిని నియమించుకుంది. అయితే, ఈసారి ఐటీ రంగంలో అంత పెద్ద సంఖ్యలో నియామకాలు ఉండవని, జనరల్ బ్యాంకింగ్ సిబ్బందికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.ఒకవైపు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు విస్తరిస్తున్నప్పటికీ, భౌతిక బ్రాంచ్‌ల ప్రాధాన్యాన్ని కూడా బ్యాంకు గుర్తిస్తోందని ఛైర్మన్ అన్నారు. ఇందులో భాగంగా, కొత్తగా అభివృద్ధి చెందుతున్న నివాస, వాణిజ్య ప్రాంతాల్లో ఏటా నికరంగా 200 నుంచి 250 కొత్త శాఖలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.సీఎన్‌బీసీ టీవీ18 కథనం ప్రకారం, కొన్ని పాత బ్రాంచ్‌లను హేతుబద్ధీకరించే ప్రక్రియ కూడా కొనసాగుతుందని తెలుస్తోంది. 2026 మార్చి నాటికి ఎస్‌బీఐలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలకు పైగా ఉంది. తాజా నియామకాలతో బ్యాంకు తన సేవలను మరింత విస్తృతం చేయాలని భావిస్తోంది.

# భారత్ చమురు కొనేది రష్యా కోసం కాదు.. దేశం కోసమే: రష్యా



భారత్ తమ దేశ ప్రయోజనాలు, ఇంధన అవసరాల కోసమే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందని, అంతేకానీ మాస్కోకు సాయం చేయడానికి కాదని భారత రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ సంక్షోభం నేపథ్యంలో రష్యాతో వాణిజ్యంపై పశ్చిమ దేశాల నుంచి ఒత్తిడి పెరుగుతున్న తరుణంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.భారత ప్రభుత్వ రంగ ప్రసార సంస్థ 'డీడీ ఇండియా'కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అలిపోవ్ మాట్లాడారు. "భారత్ రష్యాకు సాయం చేయాలన్న ఉద్దేశంతో చమురు కొనడం లేదు. తన ప్రజలు, దేశాభివృద్ధి కోసమే కొనుగోలు చేస్తోంది" అని ఆయన వివరించారు. భారత్‌కు ఎంత చమురు అవసరమైనా సరఫరా చేసేందుకు రష్యా కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు.పశ్చిమ దేశాలు విధిస్తున్న ద్వితీయ శ్రేణి ఆంక్షలు, టారిఫ్‌లను ఆయన 'ఒత్తిడి తంత్రాలు'గా అభివర్ణించారు. "నిజాయతీగా సహకరించే బదులు ఈ దేశాలు ఒత్తిడి మార్గాన్ని ఎంచుకున్నాయి. అందుకే అవి భారత్‌కు మా కంటే మెరుగైన డీల్ ఇవ్వలేకపోతున్నాయి" అని ఆయన విమర్శించారు. రష్యా చమురు లేకుండా ప్రపంచ ఇంధన మార్కెట్లు సమర్థంగా పనిచేయలేవని, భారత్‌తో పాటు ఇతర దేశాలకు రష్యా చమురు అందుబాటులో ఉంటుందని అలిపోవ్ అన్నారు.2022లో జీ7, యూరోపియన్ యూనియన్ రష్యా ఇంధనంపై ధరల పరిమితి విధించిన తర్వాత భారత్ ఆ దేశం నుంచి చమురు దిగుమతులను గణనీయంగా పెంచుకుంది. ఈ వాణిజ్యం కేవలం భారత్ అభివృద్ధి ప్రాధాన్యతలకు అనుగుణంగా సాగుతున్న వాణిజ్య ఒప్పందమేనని ఇరు దేశాలు స్పష్టం చేస్తున్నాయి.

# పర్సనల్ లోన్ ముందే చెల్లిస్తే "క్రెడిట్ స్కోర్" పెరుగుతుందా నిపుణుల సమాధానమిదే !

**అధిక వడ్డీ రేట్ల కారణంగా గడువు కంటే ముందే పర్సనల్ లోన్ చెల్లించేందుకు ముందుకొస్తున్న ప్రజలు**

**అయితే లోన్ క్లోజ్ చేసే ముందు ఈ విషయాలు తెలుసుకోవాలని సూచన**




ప్రస్తుత రోజుల్లో వివిధ అవసరాల కోసం రుణాలు తీసుకోవడం కామన్ అయ్యింది. ముఖ్యంగా ఈజీగా లభించే పర్సనల్ లోన్‌ను చాలా మంది తీసుకుంటున్నారు. అయితే ఈ లోన్ తీసుకున్నాక చేతిలో డబ్బు ఉంటే వెంటనే ఈ లోన్ తీర్చేయాలని భావిస్తారు. ఎందుకంటే ఈ రుణాలకు వడ్డీ రేట్లు ఎక్కువగా ఉంటాయి. అయితే అసలు వ్యక్తిగత రుణాన్ని ముందే తీరిస్తే మంచిదేనా ఇలా తీర్చడం వల్ల క్రెడిట్ స్కోర్ వెంటనే పెరుగుతుందాఅనే వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.వడ్డీ రేట్లు ఎక్కువగా ఉండే వ్యక్తిగత రుణాల విషయంలో "ముందస్తు చెల్లింపు" ఆర్థికంగా మంచి నిర్ణయమే అని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల వడ్డీ భారం తగ్గడమే కాకుండా, ప్రతినెలా చెల్లించాల్సిన ఈఎంఐల ఒత్తిడి నుంచి తక్షణ ఉపశమనం లభిస్తుంద ంటున్నారు.క్రెడిట్ స్కోర్ పెరుగుతుందా: రుణాన్ని తీర్చగానే క్రెడిట్ స్కోరు ఒక్కసారిగా పెరిగిపోతుందని చాలామంది భావిస్తుంటారు. కానీ, వాస్తవం ఇందుకు భిన్నంగా ఉంటుందంటున్నారు. అప్పు తీర్చడం వల్ల ఆర్థిక పరిస్థితి మెరుగుపడినా, క్రెడిట్ స్కోరుపై దాని ప్రభావం వెంటనే కనిపించకపోవచ్చని వివరిస్తున్నారు. ఎందుకంటే క్రెడిట్ స్కోరు కేవలం అప్పులు లేకపోవడంపైనే ఆధారపడి ఉండదని, గతంలో మీరు అప్పులు ఎలా చెల్లించారు ప్రస్తుతం ఎంత అప్పు ఉంది ఎన్ని సంవత్సరాలుగా క్రెడిట్ కార్డు వాడుతున్నారు మీ వద్ద ఎన్ని రకాల రుణాలు ఉన్నాయి వంటి అనేక అంశాలను క్రెడిట్ బ్యూరోలు లెక్కిస్తాయని వివరిస్తున్నారు.ఒక వ్యక్తిగత రుణాన్ని ముందే తీర్చేసినప్పుడు, క్రెడిట్ హిస్టరీ నుంచి ఒక లోన్ ఖాతా తగ్గిపోతుందంటున్నారు. తక్కువ క్రెడిట్ చరిత్ర ఉన్నవారికి, ఉన్న ఒక్క అప్పు తీరిపోతే.. క్రెడిట్ బ్యూరోల వద్ద విశ్లేషించేందుకు తగినంత సమాచారం ఉండదని, దీనివల్ల స్వల్పకాలంలో స్కోరు పెరగకుండా అలాగే ఉండటమో, లేదా కొద్దిగా తగ్గడమో జరగొచ్చం టున్నారు. రుణ సమాచారాన్ని బ్యాంకులు ప్రతి 15 రోజులకు ఒకసారి క్రెడిట్ బ్యూరోలకు నివేదించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మార్గదర్శకాలు చెబుతున్నాయని, బ్యాంకుల అంతర్గత ప్రక్రియల వల్ల క్రెడిట్ నివేదికలో మార్పులు కనిపించేందుకు కొంత సమయం పట్టొచ్చంటున్నారు.

**తేడాలు గమనించండి :**

రుణాన్ని ముగించే క్రమంలో "క్లోజ్డ్", "సెటిల్డ్" అనే రెండు పదాలు చాలా కీలమైనవని, వీటి మధ్య తేడా తెలియకపోతే భవిష్యత్తులో కొత్త రుణాలు పొందడం కష్టమవుతుందంటున్నారు.అసలు, వడ్డీ కలిపి బ్యాంకుకు చెల్లించాల్సిన మొత్తం బాకీని పైసా వదలకుండా చెల్లిస్తే, ఆ రుణాన్ని "క్లోజ్డ్"గా పరిగణిస్తారని, ఇది మీ క్రెడిట్ రిపోర్టులో సానుకూలంగా కనిపిస్తుందంటున్నారు.ఒకవేళ ఆర్థిక ఇబ్బందుల వల్ల పూర్తి అప్పు కట్టలేక, బ్యాంకుతో రాజీపడి కొంత మొత్తం తగ్గించుకొని, బాకీ చెల్లిస్తే, దానిని "సెటిల్డ్"గా నమోదు చేస్తారంటున్నారు. అంటే మీరు తీసుకున్న అప్పును పూర్తిగా తిరిగి చెల్లించలేదని దీని అర్థం. ఇలాంటి రిపోర్టు ఉంటే, భవిష్యత్తులో బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ఇష్టపడకపోవచ్చంటున్నారు.ఇవి చూసుకోండి: రుణాన్ని పూర్తిగా చెల్లించిన తర్వాత బాధ్యతాయుతమైన రుణగ్రహీతగా మరికొన్ని పనులు చేయాలని నిపుణులు చెబుతున్నారు అవేంటంటే.లోన్ తీర్చేసిన వెంటనే బ్యాంకు నుంచి "నో డ్యూ సర్టిఫికెట్" లేదా "క్లోజర్ లెటర్" తప్పనిసరిగా తీసుకోవాలనుకుంటున్నారు. అప్పు పూర్తయిందని చెప్పేందుకు ఇదే ప్రధాన ఆధారం అంటున్నారు.అప్పు చెల్లించిన కొన్ని వారాల తర్వాత క్రెడిట్ నివేదికను వెరిఫై చేయాలని, అందులో సదరు రుణ ఖాతా "క్లోజ్డ్" అని ఉందో లేదో గమనించమంటున్నారు. ఒకవేళ అది ఇంకా "యాక్టివ్"గా ఉన్నా లేదా పొరపాటున "సెటిల్డ్" అని కనిపించినా వెంటనే క్రెడిట్ బ్యూరోకు ఫిర్యాదు చేయాలంటున్నారు.కేవలం స్కోరు పెరుగు తుందన్న ఆశతో, అధిక వడ్డీ భారం మోస్తూ రుణాన్ని కొనసాగించడం సరైనది కాదని, వడ్డీ భారం తగ్గించుకోవడమే మొద టి ప్రాధాన్యం కావాలంటున్నారు.రుణాన్ని తొందరగా తీరిస్తే, భారం తగ్గి, ఆర్థిక స్వేచ్ఛ లభిస్తుందని, స్కోరులో చిన్నపాటి మార్పులు సహజమే అయినా, దీర్ఘకాలంలో మీరు చూపే క్రమశిక్షణే మీ క్రెడిట్ స్కోరును పెంచుతుందని వివరిస్తున్నారు.

## కెప్టెన్‌గా రింకు సింగ్ మ్యాజిక్.. మీరట్‌కు యూపీ టీ20 టైటిల్

**ఫైనల్‌లో 40 బంతుల్లోనే సెంచరీతో చెలరేగిన ఓపెనర్ దివ్యాంశ్ జోషి**

**గాయంతోనే ఆడి జట్టును ఫైనల్ చేర్చిన కెప్టెన్ రింకు**

**కేకేఆర్ కెప్టెన్సీ రేసులో ముందుకొచ్చిన రింకు సింగ్**



భారత జట్టులో చోటు కోల్పోయినా తనలోని నాయకత్వ పటిమను, సత్తాను మరోసారి నిరూపించుకున్నాడు యువ క్రికెటర్ రింకు సింగ్. ఆయన సారథ్యంలోని మీరట్ మేవరిక్స్ జట్టు యూపీ టీ20 టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం లక్నోలోని ఏకానా స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో భువనేశ్వర్ కుమార్ నేతృత్వంలోని లక్నో ఫాల్కన్స్‌పై 94 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కెప్టెన్సీ రేసులో రింకు పేరు బలంగా వినిపిస్తోంది.ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన మీరట్ మేవరిక్స్, ఓపెనర్ దివ్యాంశ్ జోషి విధ్వంసక సెంచరీతో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీ స్కోరు చేసింది. కేవలం 40 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్సర్లతో 105 పరుగులు సాధించిన జోషి, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. అయితే కెప్టెన్ రింకు సింగ్ ఈ మ్యాచ్‌లో 2 బంతుల్లో 1 పరుగు మాత్రమే చేసి నిరాశపరిచాడు. అనంతరం లక్ష్య ఛేదనలో లక్నో ఫాల్కన్స్ 16 ఓవర్లలోనే 109 పరుగులకు కుప్పకూలింది.రింకు సింగ్ నాయకత్వంలో మీరట్ మేవరిక్స్ ఫైనల్ చేరడం ఇది వరుసగా నాలుగోసారి కాగా, టైటిల్ గెలవడం రెండోసారి (2024లో మొదటిది). ఈ టోర్నీలో కెప్టెన్‌గా రింకు అద్భుతంగా రాణించి 10 మ్యాచ్‌లకు సారథ్యం వహించి 9 విజయాలు అందించాడు. క్వాలిఫైయర్ 2 మ్యాచ్‌లో చేతికి గాయమైనా, పెయిన్‌కిల్లర్స్ తీసుకుని బరిలోకి దిగి జట్టును ఫైనల్‌కు చేర్చాడు.యూపీ టీ20లో కెప్టెన్‌గా సాధించిన ఈ విజయం, ఐపీఎల్‌లో కేకేఆర్ కెప్టెన్సీకి రింకు పేరును బలంగా తెరపైకి తెచ్చింది. గత సీజన్‌లో కేకేఆర్‌కు అజింక్యా రహానే కెప్టెన్‌గా, రింకు వైస్-కెప్టెన్‌గా వ్యవహరించారు. రహానే రిటైర్మెంట్ ప్రకటించడంతో కొత్త సారథి కోసం కేకేఆర్ యాజమాన్యం అన్వేషిస్తోంది. జట్టులో సీనియర్ ఆటగాడిగా, కీలక ఫినిషర్‌గా నిలదొక్కుకున్న రింకు, 2026 సీజన్‌లో కేకేఆర్ తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. దీంతో కేకేఆర్ భవిష్యత్ కెప్టెన్‌గా అతడి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

## సాత్విక్-చిరాగ్ సంచలనం.. చైనా మాస్టర్స్ టైటిల్ సొంతం

**చైనా మాస్టర్స్ సూపర్ 750 టైటిల్‌ను గెలుచుకున్న సాత్విక్-చిరాగ్**

**ఫైనల్‌లో చైనా జోడీపై హోరాహోరీ పోరులో విజయం**

**తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకున్న భారత ద్వయం**

**ఈ సీజన్‌లో సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్**

**గాయాలతో బాధపడుతున్నా అద్భుత ప్రదర్శన కనబర్చిన భారత జోడీ**




భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సంచలనం సృష్టించారు. ప్రతిష్ఠాత్మక చైనా మాస్టర్స్ సూపర్ 750 పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. షెన్‌జెన్‌లోని అరీనాలో ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో చైనా జోడీ హీ జి టింగ్, రెన్ జియాంగ్ యూపై 11-21, 21-13, 21-17 తేడాతో అద్భుత విజయం సాధించారు.గంటా 10 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించింది. తొలి గేమ్‌లో చైనా జోడీ తమ వేగం, తెలివైన షాట్లతో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. దీంతో సాత్విక్-చిరాగ్ 11-21 తేడాతో సులభంగా గేమ్‌ను కోల్పోయారు. అయితే, రెండో గేమ్‌లో భారత ద్వయం అద్భుతంగా పుంజుకుంది. తమ అనుభవాన్ని రంగరించి, ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి 21-13తో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లారు.నిర్ణయాత్మక మూడో గేమ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. తొలుత చైనా జోడీ 4-0 ఆధిక్యంతో దూకుడుగా ప్రారంభించినా, సాత్విక్-చిరాగ్ ఏ దశలోనూ పట్టు వదల్లేదు. స్కోరు 17-17తో సమమైన కీలక దశలో భారత ద్వయం వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 21-17తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకుంది.ఈ సీజన్‌లో సింగపూర్ ఓపెన్ తర్వాత సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్ కావడం విశేషం. ఇటీవలి టోర్నీలలో నిరాశపరిచినప్పటికీ, ఈ విజయంతో వారు తిరిగి ఫామ్‌లోకి వచ్చారు. భుజం నొప్పితో సాత్విక్, వెన్ను నొప్పితో చిరాగ్ బాధపడుతున్నా... గాయాలను లెక్కచేయకుండా వారు ప్రదర్శించిన పోరాట పటిమ అభిమానులను ఆకట్టుకుంది.

## వైభవ్ సూర్యవంశీపై తిలక్ వర్మ స్లెడ్జింగ్
## అర్ధశతకం చేజార్చుకున్న యువ సంచలనం ఫ్యాన్స్ ఫైర్

**44 పరుగుల వద్ద ఔటైన యువ సంచలనం సూర్యవంశీ**

**తిలక్ తీరుపై సోషల్ మీడియాలో అభిమానుల అసంతృప్తి**

**మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ మెరుపు అర్ధశతకం (72)**



దులీప్ ట్రోఫీ ఫైనల్లో యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మరోసారి తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. నేడు సౌత్ జోన్‌తో ప్రారంభమైన ఫైనల్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 44 పరుగులు చేసి అర్ధశతకానికి చేరువలో ఔటయ్యాడు. అయితే, అతను ఔటవడానికి ముందు సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మతో జరిగిన ఓ చిన్న సంఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తిలక్ వర్మ, వైభవ్‌ను ఉద్దేశించి స్లెడ్జింగ్ చేయగా, ఆ తర్వాత కొద్దిసేపటికే వైభవ్ తన వికెట్ కోల్పోయాడు.మ్యాచ్ సమయంలో తిలక్ వర్మ.. "ఏంటి యార్ ఈ వైస్ కెప్టెన్" అంటూ వైభవ్‌ను రెచ్చగొట్టేలా మాట్లాడటం వినిపించింది. అయితే, ఈ సంఘటన తర్వాత ఇద్దరు ఆటగాళ్లు నవ్వుతూ కనిపించడంతో దీన్ని సీరియస్‌గా తీసుకోనట్లు అనిపించింది. కానీ, సోషల్ మీడియాలో మాత్రం అభిమానులు తిలక్ తీరును తప్పుబడుతున్నారు. 15 ఏళ్ల కుర్రాడిపై స్లెడ్జింగ్ వ్యూహం అవలంబించడం సరికాదని పలువురు విమర్శలు గుప్పించారు. ఈ స్లెడ్జింగ్ తర్వాత చామ మిలింద్ బౌలింగ్‌లో వైభవ్ ఔటయ్యాడు. అంతకుముందు వైభవ్ తన ఇన్నింగ్స్‌ను ఎంతో దూకుడుగా ప్రారంభించాడు. భారత సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్ బౌలింగ్‌లోనూ అద్భుతమైన షాట్లు ఆడాడు. మొత్తం మీద 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 44 పరుగులు సాధించాడు. వైభవ్ దూకుడైన ఆటతీరు మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్‌పైనా ప్రభావం చూపినట్లు కనిపించింది. ఈశ్వరన్ కూడా దూకుడుగా ఆడి 86 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 72 పరుగులు చేసి రనౌట్‌గా వెనుదిరిగాడు. వీరిద్దరి భాగస్వామ్యంతో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో శుభారంభం చేసింది.




I PRINTED, PUBLISHED & OWNED By M.SUNIL KUMAR at printed at Global printers #10 MIE Industrial Estate,Kallur,kurnool,Andhrapradesh.
Published from Hno: 4-86-1 New postal Colony,Balaji nagar,Kurnool,Andhrapradesh- 518003.EDITOR : M.sunil kumar, #1/339/17, sree ram nagar, bharpet,near nobel college ,ram-jal road Adoni kurnool district- 518301 Andhra Pradesh. E-mail: Suryaudhayamdaily@gmail.com